# ఏల్నాటి శని - దోష నివారణ

– కె. మల్లికార్జున, బళ్లారి

**శ్లో॥ నీలాంజన సమాభాసం, రవిపుత్రం యమాగ్రజం।**
**ఛాయా మార్తండ సంభూతం తం నమామి శనైశ్చరం॥**

శనిమహాత్ముడు నవగ్రహాలలో ఏడవవాడు. గ్రహసంచారంలో లగ్నం నుండి 1, 2, 12 స్థానాలలో శని సంచారకాలమును 'ఏల్నాటి శని' అని అంటారు. మేషరాశి మొదలు అన్ని రాశులలో శని మహాత్ముడు రెండున్నర సంవత్సరాలు ఉంటాడు.

శనిప్రవేశించిన తొలి 5 సంవత్సరాలు రాశిలో ఉంటే ఎక్కువ కష్టాలు కలుగుతాయి. చివర రెండున్నర సంవత్సరాలు శని ఉంటే చిక్కులు తగ్గుతాయి. శని 12వ ఇంట ఉంటే నష్టాలు అధికంగానూ, లగ్నంనందు ఉంటే మహావిపత్తు, చివర 2 వ ఇంట వుంటే ధననష్టం కలుగును.

ప్రతివ్యక్తికీ ఏల్నాటి శని ఉంటుంది. వ్యక్తి జన్మించినప్పుడు ఏల్నాటిశని వుంటే, తిరిగి అతనికి 30వ ఏటను, 60వ ఏటను పీడించును. వ్యక్తి జీవితంలో రెండు మూడుసార్లు ఏల్నాటి శని రావచ్చును. రాశిచక్రంలో శనిగమనం, తానున్న స్థలమును తిరిగి చేరుటకు 30 సంవత్సరాలు పట్టవచ్చును. ఏల్నాటిశని ప్రభావం శని ఉచ్ఛ, త్రికోణ స్వక్షేత్రం లందును, మేలు చేస్తున్నప్పటికీ ఈ ఏడున్నర సంవత్సరాలు కొంత నష్టం, కష్టాలను కలిగించును.

**దోష నివారణ:-**

ఏల్నాటి దోషానికి నివారణ కూడా ఉన్నది. జ్యోతిశాస్త్రం దోష నివారణకు మార్గాన్ని చూపుతుంది. అంతేకాక సుఖమయ జీవితాన్ని గడపడానికి మార్గం కూడా చూపుతుంది. ప్రతిరోజూ ప్రాతః కాలంలో శని స్తోత్రాన్ని పఠించాలి.

**శనిస్తోత్రం:-**

1. **నమస్తే కోణ సంస్థాయ పింగళాయ నమోస్తుతే**
   **నమస్తే బభ్రురూపాయ కృష్ణాయచ నమోస్తుతే**
2. **నమస్తే రౌద్రదేహాయ నమస్తే చింతకాయచ**
   **నమస్తే యమ సంజ్ఞాయ నమస్తే సౌరయే విభో**
3. **నమస్తే యమ సంజ్ఞాయ శనైశ్చర నమోస్తుతే**
   **ప్రసాదు మమ దేవేశ దీనస్య ప్రణతిస్యద**

ఈ శని స్తోత్రంతోపాటు దేవాలయాలలో, శివాలయాలలో శనికి తైలాభిషేకం, పూజలు చేస్తే దోషనివారణ కలుగును. అంతర్దశ బాగాలేనప్పుడు శని అష్టోత్తర శతనామావళి ప్రతిరోజూ పఠించాలి. దీనితోపాటు శని దశనామాల శ్లోకం కూడా పఠిస్తే మంచిది.

**కోణానః పంగళో బభ్రుః కృష్ణో శాంద్రోంత కో యమః**
**సౌరిః శనైశ్చరో మందః పిప్పల దేవ సంస్తుతః**

–అంటే శనిదశ నామాలు– శనైశ్చర, యమ, కోణ, పింగళ, బభ్రు, కృష్ణ, రౌద్ర, అంతక, శౌరి, మంద.

మనిషి జీవితంలో శనిదశలు నడుస్తున్నప్పుడు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అరగంట జపించడం వల్ల అంతా శుభమే కలుగును.

శని దశలు సాగని రోజులలో కూడా శనినాద తరంగణిమంత్రాన్ని జపిస్తే మంచే జరుగుతుందని పెద్దల ప్రగాఢ విశ్వాసం.

**శనినాద తరంగిణి మంత్రం:**

**ఓం క్రాం క్రీం క్రీం సః శనియేనమః**
**ఓం ప్రాం ప్రీం ప్రౌ సః శనేశ్చరాయణ నమః**

ఈ మంత్రం శనిమహాత్మునికి అత్యంత ప్రీతిపాత్రమైన మంత్రంగా భావిస్తారు. అంతేకాక ఈ మంత్రం మహాశక్తివంతమైనదని నమ్మకం.

మనిషి నిజజీవితంలో అతనిమీద జీవన గమనం ప్రధానంగా గ్రహస్థితి మరియు గృహస్థితి మీద ఆధారపడి ఉంటుంది. మనిషియొక్క గ్రహస్థితిలో వచ్చే మార్పుల వల్ల ఎదురయ్యే ఆటుపోట్లనుండి తట్టుకోవడానికి సులభమైన మార్గం నవగ్రహ ప్రదక్షిణలు. ఈ నవగ్రహ ప్రదక్షిణల వల్ల ఉత్పన్న మయ్యే దైవికశక్తి ఎండవానల నుండి కాపాడే గొడుగులాంటిది. ఈ విధంగా ఏల్నాటి శని తొలగునని నమ్మకం.

శని ప్రతిమను ఇనుముతో చేయించి, ఆ ప్రతిమను మూకుడుయందుగానీ, లోహపాత్రయందు ఉంచి, నల్లని నువ్వులు, నల్లని పూలు, నల్లని గంధం, నల్లని గుడ్డ, శని దగ్గర ఉంచి, పూజించి నల్లని బ్రాహ్మణునికి దానమిస్తే ఏల్నాటి శని దోష నివారణ కలుగునని శాస్త్రవచనం.

కొన్ని సందర్భాలలో గ్రహదోషాలు పోవాలంటే గోవును పూజించి సేవించడం కూడా ఉత్తమమార్గం. ఒక్కొక్క గ్రహానికి ఒక్కొక్క ధ్యానం చెప్పబడింది. ఏల్నాటి శని దోషముతో బాధపడువారు నువ్వులు, బెల్లం కలిపి, ఆకుకూరలు, పండ్లుతోబాటు శనివారంనాడు గోవుకు తినిపిస్తే ఎటువంటి దోషమైననూ తొలగిపోవును. ఇలా చేసి భయంకరమైన శనిదోషాలు పోగొట్టుకున్నవారు ఎంతోమంది ఉన్నారు.

శనిదోష నివారణకు శనిస్తోత్రం పఠిస్తూ, నువ్వుల నూనెతో శనిమహాత్మునికి అభిషేకం చేసి, జప సంఖ్య 10 వేలు చేయాలి. బ్రాహ్మణులకు నువ్వులు దానం చేయాలి. చెట్టు– శమీవృక్షం.

## గ్రహదోష నివారణకు నవరత్న ఖచిత అంగుళీయం

శాస్త్రోక్త నవరత్న ఖచిత అంగుళీయకమును సర్వదా ధరించినచో గ్రహదోష నివా రణమే కాకుండా శుభ ఫలితములు కలుగుతాయని శాస్త్ర వచనం. నవగ్రహ మంగళ అష్టోత్తర స్తోత్ర రత్నములు పఠిస్తే ఎంతో మంచి జరుగుతుందని నమ్మకం. ఏల్నాటి శని దోష నివారణకు ఇంద్రనీలం అంగుళీయమును ధరించుట కూడా శుభం.

| | | |
|---|---|---|
| బుధ<br>మరకతం | శుక్ర<br>వజ్రం | చంద్ర<br>మౌక్తికం |
| గురు<br>పుష్యరాగం | రవి<br>మాణిక్యం | కుజ<br>విద్రుమం |
| కేతువు<br>వైఢూర్యం | శని<br>ఇంద్రనీలం | రాహు<br>గోమేధికం |

## వాసిగొన్న వాసా ప్రభావతి!



వాసా ప్రభావతి సరళ సుమ విమల మధురిమలను చిత్రించగల ప్రతిభావంతురాలైన రచయిత్రి. ఆమె నవలలనూ వ్రాసారు. ప్రబంధ కావ్యాల శైలిలోనూ పుస్తకాలు వ్రాసారు. ఎప్పుడూ ప్రశాంతంగా కనిపించే వాసా ప్రభావతిలో స్త్రీ రచయితకున్న లక్షణాలున్నాయ్. సుహృద్భాషిణి, ఆమె రచనా సంవిధానం ఎంతగా హృద్యమంగా ఉంటుందో మాటతీరు కూడా అంత హృద్యమంగానూ ఉంటుంది. హైదరాబాద్‌లో ఎన్నో సమావేశాల్లో కలిశాను. ఆమె 'ప్రముఖాంధ్ర' అభిమాని. సారస్వత రుచులెరిగిన సరస్వతి.

ఆమె మద్రాసు వచ్చినపుడు మాలతీచందూర్ ఒక గోష్టిపరమైన సభను ఏర్పాటు చేస్తే గంటన్నరపాటు శ్రోతలైన రచయితలతో ముఖాముఖీగా మాట్లాడుతూ ఎక్కడా ఏ విషయంలోనూ తడుముకోకుండా తత్తరపడకుండా సంభాషించడం సభికుల నెంతగానో ఆకట్టుకున్నది.

ఈ మా (మీ) అభిమాన రచయిత్రి వాసాప్రభావతి గారి విశేషాలను, గ్రంథ రచనలను 'ప్రముఖాంధ్ర' పఠితల కందజేయడానికి ప్రయత్నిస్తాం.


ఆ మధ్య చెన్నయ్‌లో పొట్టిశ్రీరాములు స్మారక మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె తన సుదీర్ఘ సాహిత్యానుభవాలను పూసగుచ్చినట్టు ప్రముఖ రచయిత్రి మాలతీచందూర్‌కు వివరించారు. గంటలన్నరపాటు ఆసక్తిగా ఈ సాహిత్య కార్యక్రమం నడిచింది. పరిశోధకురాలిగా, కవయిత్రిగా, కథానికా, నవల రచయిత్రిగా తనకు ఎదురైన సంఘటనలనూ, సంగతులనూ ప్రభావతి చక్కటి కథలా చెప్పుకొచ్చారు. స్వాతంత్ర్య సమరంలో తెలుగు మహిళలు పుస్తక రచనకు కలిగిన ప్రేరణనూ, ఆ వ్యాసంగంలో పడ్డ శ్రమనూ ఆమె వివరించారు. ప్రభావతి కథల్లో అచ్చ తెలుగు పదాలు, తెలుగువాతావరణం కనిపిస్తాయి. ముక్తాయింపు పలుకుతూ చెప్పినట్టు "ఆత్రేయపురంలో పుట్టి ఆకాశం దాకా ఎదిగిన ఓ సాహస బాలిక జీవితం' విన్న కన్న సంతృప్తి సభికులకు కలిగింది.

# శ్రావణం వచ్చింది గోరుగోరునా గోరింట పండింది! గోరింటా పూసింది.. కొమ్మాలేకుండా అన్నది వాస్తవమైంది!









గోరింటా పూసింది కొమ్మాలేకుండా.. మురిపాల అరచేతా మొగ్గా తొడిగింది అన్న పాట అబద్ధమైంది. శుభకార్యాలు, పండుగలకు వచ్చినపుడు మహిళలు ఎక్కువగా గోరింటను ధరిస్తారు. వైద్యాలకు కూడా గోరింట ప్రసిద్ధి. మనదేశంలోనే గాకుండా పాకిస్తాన్, సిరియా, ఇరాన్, ఈజిప్టులలో గోరింటాకును పెట్టుకునే సంప్రదాయం ఉంది. హిందువుల ఇళ్ళల్లో తులసి మొక్కకు ఎంత ముఖ్యమో ముస్లింలకు గోరింట చెట్టు అంత ముఖ్యమైందని ఖురాన్ పేర్కొంది.

గోరింట పండే విధానంపై మనవారు అనేక రకాలుగా చెప్పారు. గోరింట పెట్టిన గోరు మందార పువ్వు రంగులో పండితే మంచి మొగుడు, గన్నేరు పువ్వు రంగులో పండితే ధనవంతుడు, సింధూరపు రంగంలో పండితే అందమైన మొగుడు లభిస్తాడని అంటారు. గోరింట ఏరంగులో పండినా ఆ సొగసు ఇతరుల కళ్ళకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించడానికే!

అందుకే ఆడవారు పెళ్ళిల్లూ, పేరంటాలు వచ్చినపుడు నలుగురూ గుర్తించేలా గోరింటను తమ వేళ్ళకు పూమొగ్గలా అలంకరించుకుంటూ ఉంటారు. గోరింటాకులను మొత్తగా ముద్దచేసి దానిలో రెండు లేదా 3 చుక్కల నిమ్మరసం, అర చెంచా లవెండర్ నూనె, అరస్పూన్ చక్కెర, రెండు చెంచాల పెరుగును కలిపి ఒక 5 నిమిషాలు ఊరనివ్వాలి. వీటిని కలపడం వల్ల గోరింటలోని లాసోనీ పినల్ పదార్థం త్వరగా చర్మంలోకి చేరి చేతులను తొందరగా ఎర్రబారేటట్లు చేస్తుంది. ఇప్పుడతివల అభిరుచి మారింది. వయసుకు తగిన రకరకాల మెహందీ డిజైన్లు ఇప్పుడు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. బటర్ పేపర్ లేదా పాలీ ఎక్రిలిక్ పేపరుపై ఈడిజైన్లను రూపొందించగా తయారైన రెడీమేడ్ డిజైన్ పేపరుని శరీరంపై ఉంచి హెన్నాను అలంకరిస్తారు. ఈ డిజైన్‌ను చేత్తో వేయాలంటే కనీసం 30 నుండి 45 నిమిషాలు పడుతుంది. విదేశీయుల టాటూ కళతో మన ఈ మెహందీ డిజైన్ కళ పోటీగా పరుగెడుతోంది. శరీరంపై వేసిన గోరిట డిజైన్లు 2 లేదా 3 వారాల దాకా ఉంటాయి. అదే రసాయనాలు వాడే టాటూలైతే స్కిన్ అలర్జీని కల్గిస్తాయి. గోరింట వల్ల ఎలాంటి అలర్జీ రాదు. అయినా ఆడవాళ్ళు మెహందీకే మొగ్గుచూపిస్తున్నారు.

క్రీ.పూ. 400 సంవత్సరాల నుంచి గోరింటను అలంకారంగానే ధరిస్తున్నారు. గజ్జి కురుపులకు గోరుచుట్టు నివారణకు గోరింట మందు. గోరింటాకులో ఉండే లాసోనీ అనే కార్బన్ మిథనాల్ పదార్థం వల్ల దీనిని ధరించిన ప్రదేశం ఎరుపు రంగులోకి మారుతుంది. 19వ శతాబ్దంలో జియాన్నీ నటీమణి గోరింటాకును

ప్రథమంగా హెయిర్ డైగా వాడారు. హెన్నా లేదా గోరింటాకుతో శరీరం మీద పెట్టుకునే పలు రకాల డిజైన్లను బాడీ ఆర్ట్ అని, ఆర్ట్ ఆఫ్ మెహందీ అని వ్యవహరిస్తున్నారు. గోరింటలోని ఫినాల్ పదార్థాలు ఫంగస్ క్రిములను నాశనం చేయడమే కాకుండా శరీరంలోని మలినాలను శుభ్రపరిచే యాంటీ ఆక్సిడెంట్స్‌గా పనిచేస్తాయి. కానీ కానీ గోరింటాకును కోసి రోట్లో రుబ్బి పెట్టుకునే పడతులేరీ! ●

## అవగాహన లేకే అపభ్రంశాలు మాట్లాడతారు!

తెలుగు పదానికి సందర్భానుసారమైన పదాలు ఉంటాయ్. నన్నయ్యగారి పద్యం నడక ఒక్కొక్కచోట తేలిగ్గా ఉంటుంది. కానీ భావం నిగూఢం. చాలామందికి అర్థం కాదు. నన్నయ్యగారి భాషలో నానార్థాలు ఎక్కువ. పదం తేలిక. అర్థం బరువు.

**వార్త :** 'వార్త' అనగానే సమాచారం అని అర్థం చెప్పుకుంటాం ఆ పేరుగల పత్రికవారు అలాగే అనుకున్నారు. మహాభారతంలో ధర్మరాజుని రాజ్యపాలన ధర్మాలను అడిగే సందర్భంలో యీ పద్యం సభాపర్వంలో కనిపిస్తుంది.

**వార్తయందు జగము వర్తిల్లుచున్నది**
**యదియు లేనినాడు యఖిల జనులు**
**అంధకారమగ్నులగుదురు గావున**
**వార్త నిర్వహింపవలయు పతికి.**

మనం సర్వసాధారణంగా 'వార్త' అంటే సమాచారం అనే అర్థంలో వాడతాం. వార్తాపత్రిక, వార్తామాధ్యమాలు వాడుకొనే యీ పద్యంలో వార్తకి అర్థం వేరు. ఈ పద్యానికి వ్యాసమూల శ్లోకానికి పండిత నీలకంఠుడు తన వ్యాఖ్యానంలో– వార్తా కృషిర్వాణిజ్యం పాశుపాల్యం కుసీదం చతుర్విధా అని వివరించాడు. వ్యాపారం, పశుపాలన, వ్యవసాయం, వడ్డీ వ్యాపారం యిలా నాలుగు రకాలు అని దీని భావం. అయితే ప్రాచీన పదాలకు అర్థాలు మారినాయి. కాని నాటి భావాన్ని నేటి భావాలకు అన్వయించడం మన్నన కాదు.

Beautiful City - Beautiful Hotel



DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# చల్లని నా స్వామి చెన్న కేశవా!



గుంటూరు జిల్లా పల్నాడు తాలూకా మాచర్ల పట్టణంలో ఉన్న శ్రీలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి దేవాలయం ఆధ్యాత్మికంగానూ, చారిత్రకంగాను అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది.

ఈ ఆలయానికి పశ్చిమాన కృష్ణానది ప్రవహిస్తూ ఉంటుంది. పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతల, విశ్వామిత్రుడు తపస్సు చేసిన సత్రశాల, నాగార్జును నివసించిన శ్రీపర్వతం ఈ సీమలోనివే.

శ్రీ చెన్నవకేశవస్వామికి మరోపేరు చెన్నుడు అనే పేరున్నది. అంటే అందగాడని అర్థం. విష్ణువుకి ప్రతిరూపమే ఈ చెన్నుడు. గర్భగుడిలో మూడు అడుగులు ఎత్తు ఉన్న దేవకిపై స్వామీ ఆసీనుడై దర్శనమిస్తాడు. గర్భాలయమందు అంతరాలయం ఉంది. దీనిలో శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామి ఉన్నారు. ఇక్కడ ప్రతి సంవత్సరం ఏప్రియల్ నెలలో రథోత్సవం జరుగుతుంది. అరవై అడుగుల ఎత్తులు కలిగిన ఈ రథాన్ని ఆరంతస్థులతో నిర్మించారు. 1879 ఏప్రిల్ 23వ తేదీ నుండి ఈ ఉత్సవం నిరవధికంగా జరుగుతుందని ఇక్కడివారు చెబుతారు.

క్రీశ 10 వ శతాబ్దిలో ఉత్తర హిందూ దేశంలో పాలమాచాపురి పట్టణం ఉండేదట. దానిని కార్తవీర్యార్జునుని సంతతివాడైన అనుగురాజు పరిపాలించేవాడు. వారి ఇలవేల్పు చెన్నకేశవుడు. అనుగురాజుకు తన గ్రామం వచ్చిన సందర్భంగా 'నాగమ్మ' ఆతిథ్యం ఇచ్చింది. అందుకు సంతసించిన అనుగురాజు నాగమ్మను వరం కోరుకోమన్నాడు. తనకు ఏడు ఘడియలు మంత్రిత్వం కోరుకుంటుంది. అనుగురాజు సమ్మతి పత్రం రాసి ఇచ్చాడు. అతని మరణానంతరం అతని కుమారుడు నలగామరాజు రాజయ్యాడు. అతని తండ్రి రాసి ఇచ్చిన పత్రం ద్వారా మంత్రి పదవిని చేపట్టిన నాగమ్మ, అప్పటివరకు మంత్రిగా ఉన్న బ్రహ్మనాయుడిపై చాడీలు చెప్పి, నలగామరాజు మనసు విరిచేస్తుంది. బ్రహ్మనాయుడు అక్కడ ఉండలేక నలగామరాజు తమ్ముళ్ళతో కలిపి మాచర్లలో మకాము చేస్తాడు. అక్కడ ఒక దేవాలయం నిర్మించి, తన ఇలవేల్పయిన 'చెన్నుని' ప్రతిష్ఠించాడు అనంతరం పల్నాటిరాజ్యం పరిపాలించాడు.

**పల్నాడు కోడిపందాలకు ప్రసిద్ధి.**

ఈ ఆలయం నిర్మించిన తరువాత బ్రహ్మనాయుడికి, నాగమ్మకు మధ్య కోడిపందేలు వచ్చాయ్! ఈ సందర్భంలో బ్రహ్మనాయుడి ప్రార్థనకి ప్రసన్నుడైన స్వామి కోడిపుంజుగా వచ్చి బ్రహ్మనాయుడిని గెలిపించాడు.

సంతానంలేనివారు స్వామి చుట్టూ ప్రదక్షిణలు చేస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి భక్తుల మరో విశ్వాసం.

చైత్ర శుద్ధ పూర్ణిమ నుంచి మాచెర్లలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. పంచమినాడు వేలకొలది భక్తులు స్వామిని దర్శించుకుంటారు. ప్రాచీనమైన ఈ ఆలయం పలుమార్లు పునర్నిర్మాణం చేసినట్లు తెలుస్తుంది. కీ.శ. 1560లో నవాబు వద్ద మంత్రులుగా ఉన్న అక్కన్న, మాదన్నల ప్రాపంకంతో నూరపరాజు వెంకటరాయుడు ఈ సమీను పాలించారు.

లక్ష్మీదేవమ్మ అనే బాలిక చిన్నతనం నుండి చెన్నుని భక్తిశ్రద్ధలతో కొలిచేది. ఎనిమిదేళ్ళ వయస్సులో తోటి పిల్లలతో ఆడుకుంటూ ఆలయంలోని వెళ్ళి స్వామిలో ఐక్యమయింది. ఆ రాత్రి తల్లిదండ్రులకు కనిపించి తన పూర్వ జన్మ సుకృతం వల్ల ఈ విధంగా జరిగిందని చెప్పింది. చెన్నుని పక్కనే మరో ఆలయం నిర్మించి తన ప్రతిమను ప్రతిష్టించాలని ఏటా శ్రీవారికి ఇచ్చి కల్యాణం జరిపించమని కూడా తెలియజేసింది. అప్పటి నుండి ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. ప్రతిఏటా చైత్ర శుద్ధ తదియనాడు అంకురార్పణ, చతుర్దశినాడు ధ్వజారోహణ, పౌర్ణమినాడు కల్యాణం, విదియనాడు శేషవాహనం, తదియనాడు గరుడవాహనం, చవితినాడు సూర్యవాహన ఊరేగింపులు కన్నులపండువగా జరుగుతాయి. వెళ్లదలచినవారు మాచర్లలో అన్ని సదుపాయాలు ఉంటాయి. ఇంతమ మహిమాన్వితమైన ఆలయాన్ని ఒకసారి దర్శించడం అవసరం.

**- బెల్లంకొండ నాగేశ్వరరావు**

# మతం ఎపుడూ మనిషిని ప్రేమిస్తుంది! ద్వేషించదు! ఆంధ్రరత్న రామదండుకు గౌస్‌బేగ్ ప్రేమపాత్రుడు!



గాంధీగారి స్వాతంత్ర్యోద్యమ పిలుపుకు ఆంధ్రదేశం ఎంతగానో స్పందించింది. అందునా చీరాలా- పేరాల సత్యాగ్రహోద్యమం మహోద్యమంగా పరిణమించింది. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య రామదండు పేరిట బ్రిటీష్‌వాళ్లను గడగడలాడించారు. బ్రాహ్మణులు, ముస్లిములు, ఇతర పౌరులు ప్రాణాలను సహితమూ త్యజించి, త్యాగబుద్ధితో పోరాడారు. ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ సోదరుడు ఖాన్ సాహెబ్ ఆ ప్రాంతం వాడేయైన జనాబ్ గౌస్ సాహెబ్ బేగ్‌ను చీరాల పేరాల సత్యాగ్రహోద్యమంలో చురుకుగా పాల్గొని జైలుపాలయ్యాడు. అప్పటి ఒంగోలు సబ్‌కలెక్టర్ హైదరి ముస్లిము. ఆయన గౌస్‌బేగ్‌ను పిలిపించి, విందునిచ్చి, 'నీవు పాల్గొంటున్న ఉద్యమం బ్రాహ్మణ ఉద్యమం, నీవు ఈ ఉద్యమం నుండీ వెంటనే విరమించు, నీవలన సాహెబ్‌లందరికీ చెడ్డపేరు వస్తుంది. ఈ బ్రాహ్మణ ఉద్యమం నుంచీ బయటకు వచ్చావంటే- నీకు జైలు శిక్షా తప్పుతుంది. కేసులూ పోతాయ్. పైగా నీవు కోరుకున్న చోట 200 ఎకరముల భూమిని మంజూరు చేస్తా. విరమించుకో' అని ఒత్తిడి చేసాడు. గౌస్ బేగ్ సాహెబ్ అంగీకరించలేదు. తిరిగి జైలుకే వెళ్లాడు. జైలు నుంచి తిరిగి వచ్చిన తరువాత గోపాలకృష్ణయ్యగారు బేగక్ రామదండు సేనాని పదవినిచ్చారు. గోపాలకృష్ణగారి సలహాతో బేగ్ రామ్ రహీమ్ సైకిలు కంపెనీ పెట్టి వాటి వల్ల వచ్చే లాభాలను కూడా కాంగ్రెస్‌కే యిచ్చేవాడు. తరువాత జైలుకు వెళ్లివచ్చేసరికి వ్యాపారంలో నష్టంలో వచ్చింది. తనకున్న ఆస్తి 23 ఎకరాలు అమ్మి కాంగ్రెస్‌కే యిచ్చిన దేశభక్తుడు గౌస్. గౌస్ భేష్ నీవు భారత పౌరుడవయ్యా.




# పరమ గురువు... దక్షిణామూర్తి

బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించినపుడు తనకు సహాయంగా ఉండటానికి నలుగురు కుమారులను సృష్టించాడు. వారే సనక, సనందన, సనత్కు మారులు. బ్రహ్మ మానసపుత్రులైన ఆ నలుగురి మనసుల్లో ఎన్నో ప్రశ్నలు. ఆ ప్రశ్నలకు జవాబులు చెప్పలేకపోయాడు చతుర్ముఖుడు. ఆ ప్రశ్నలకు సమాధానం దొరక్కుండా అన్యమనస్కంగా సృష్టిని కొనసాగించే ప్రక్రియలో పాల్గొనలేమని చెప్పి విష్ణువు దగ్గరకు బయల్దేరారు వారు. వైకుంఠంలోనూ వారి ప్రశ్నలకు బదులు దొరకలేదు. వారి అవస్థను గమనించాడు పరమశివుడు. వారు వెళ్ళేదారిలో ఒక మర్రిచెట్టు కింద అర్ధనిమీలిత నేత్రుడై దక్షిణామూర్తి అవతరించాడు. ధ్యానంలో నిమగ్నమై ఉన్న ఆ స్వామిని గమనించిన సనకసనందాదులు అటువెళ్ళి హరుడి పాదాలచుట్టూ ఆశీనులయ్యారు. శంకరుడు వారిని గమనించనట్టుగా ధ్యానంలోనే ఉన్నాడు. కానీ, ఆ మౌనంలోనే వారి సందేహాలన్నీ పటాపంచలైపోయాయి. అప్రయత్నంగానే బ్రహ్మ జ్ఞానం లభించింది. 'జ్ఞానస్వరూపుడుగా పేరుగాంచిన పరమశివుడి దక్షిణామూర్తి అవతారం గురించి పురాణాల్లో కనిపించే వివరణ. దేశవ్యాప్తంగా ఆ స్వామి అనేక క్షేత్రల్లో కొలువై ఉన్నాడు. వాటిలో ముఖ్యమైన కొన్ని ఆలయాలివి...

**మహాకాళేశ్వరుడు**

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో ఒకటైన ఉజ్జయిని (మధ్యప్రదేశ్)లో శివుడు మహాకాళేశ్వరుడు. ఈ పన్నెండు క్షేత్రాలలోను శంకరుడు దక్షిణామూర్తిగా కొలువై ఉన్న తీర్థం ఇదే. మరే జ్యోతిర్లింగానికీ ఈ ప్రత్యేకత లేదు. దక్షిణాభిముఖంగా స్వయంభువై వెలసిన మహాకాళేశ్వర ఆరాధనలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. శ్మశానం నుంచి తెచ్చిన చితాభస్మంతో ఈ స్వామికి భస్మ ఆరతి ఇస్తారు. స్థలపురాణం ప్రకారం.. క్షిప్రానది ఒడ్డున ఉన్న ఉజ్జయినీ సామ్రాజ్యాన్ని కుట్రతో ఆక్రమించుకునేందుకు ఇరుగుపొరుగు రాజులు కాచుకుని కూర్చుంటారు. ఉజ్జయిని రాజు విధించిన శిక్షకు గురైన శ్రీకరుడనే చిన్నారి ఆ అపాయాన్ని గ్రహించి ఆ ఊరిపూజారికి చెబుతాడు. ఆ విషయం రాజుగారికి చెప్పే లోగానే.. బ్రహ్మవరంతో మాయారూపుడై సంచరించే దూషణా సురుడనే రాక్షుసుడి అండతో శత్రువులు విరుచుకుపడ్డారట. అప్పుడు శ్రీకరుడు, పూజారి కలిసి కైలాసనాధుణ్ని ఆర్తిగా ప్రార్థించారు. వారి మొర ఆలకించిన రుద్రుడు ప్రళయకాల ఘోషతో మహాకాళేశ్వరుడిగా ఉగ్రరూపంలో అవతరించి శత్రుసేనలను చెల్లాచెదురు చేసి, దుషణాసురుణ్ని సంహరించి రాజ్యాన్ని కాపాడాడట. అనంతరం భక్తుల కోరిక మేరకు మహాకాళేశ్వరుడి పేరిట జ్యోతిర్లింగంగా ఇక్కడ దక్షిణాభిముఖుడై వెలశాడనీ దక్షిణామూర్తిగా పూజలందుకుంటున్నాడనీ ప్రతీతి.

**గురువులకే గురువు పరమగురువు కావున ఈ దక్షిణామూర్తికి ప్రతీ గురువారమూ, అర్చన, అభిషేకం చేయడం శుభస్కరం. శివుడే దక్షిణామూర్తిగా అవతరించాడనీ, జ్ఞానబోధకుడనీ మన పెద్దల విశ్వాసం. మన ఆంధ్రదేశంలో కల విశేష దక్షిణామూర్తి క్షేత్రాలను తెలుసుకుందాం.**



**వైకోమ్ మహాదేవుడు**

కేరళలోని వైకోమ్ ప్రాంతాన దక్షిణామూర్తి రూపంలో కొలువై ఉన్న శంకరుడు మహాదేవుడు. ఈ స్వామిని స్థానికులు వైకుంతప్పన్‌గా వ్యవహరించడం విశేషం. స్థలపురాణం ప్రకారం... ఖరుడు అనే రాక్షసుడు చిదంబరంలో శివుణ్ని పూజించి మూడు శివలిండగాలను పొందాడట. అక్కడి నుంచి బయలుదేరి వస్తుండగా మార్గమధ్యంలో వైకోమ్ ప్రాంతంలో అలుపు తీర్చుకోవడానికి ఆగి ఒక శివలింగాన్ని నేలపై పెట్టగా అది భూమిలోకి కూరుకుపోయిందట. ఎంతలాగినా పైకి రాక పోవడంతో మిగతా రెండు లింగడాలను కూడా మహాదేవుడికి సమానదూరాల్లో ప్రతిష్టించాడట. అనంతర కాలంలో వ్యాఘ్రపాద మహర్షి ఈ ప్రాంతానికి వచ్చి తపస్సు చేస్తే పరమశివుడు ప్రత్యక్షమై ఆయనకు బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించి దక్షిణామూర్తిగా పూజలందుకుంటున్నాడని ప్రతీతి. ఒకప్పుడ ఈ స్వామి నిలువనీడ లేకుండా మోకాలు లోతు నీటిలో ఉండేవాడట. ఈ దారివెంట వెళ్తున్న పరశురాముడు వెలుగులు విరజిమ్ముతున్న దక్షిణామూర్తిని గమనించి ఆ స్వామికి గుడి కట్టించి ఆలయానికొక వ్యవస్థనూ, పూజావిధానాలను ఏర్పరచాడని చెబుతారు. పరశురాముడు ఏర్పరచిన విధానాల మేరకు మహాదేవుణ్ని ఇక్కడ ఉదయాన్నే దక్షిణామూర్తి గాను, మధ్యాహ్నం పూట కిరాతమూర్తిగాను కొలుస్తారు. శివుడు అభిషేక ప్రియుడు. కాబట్టి నిత్యం ఈ స్వామికి సహస్రకలశాభిషేకం జరిపిస్తారు. వైకోమ్ మహాదేవుణ్ని అన్నదాన ప్రభువు అని పిలుస్తారు. దూరతీరాల నుంచీ మహాదేవుణ్ని దర్శించు కోవడానికి వచ్చే భక్తులకు ప్రసాదంగా కడుపునిండా అన్నం పెడతారు. ఆ ప్రసాదం తింటే జీర్ణవ్యవస్థకు సంబంధించిన అనారోగ్యాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం

**ఆలన్‌గుడి ఆపద్బాంధవుడు**

శివుడు దేవగురువు బ్రహస్పతి నామధేయంతో గురు దక్షిణామూర్తిగా పూజలందుకుంటున్న పుణ్యక్షేత్రమిది. తమిళనాడలో ప్రఖ్యాతిగాంచిన దివ్యక్షేత్రం కుంభకోణానికి పదిహేడు కిమీ దూరంలో ఉందీ ఆలయం. క్షీరసాగర మథనంలో ముల్లోకాలను దహించివేసేంత వేడితో హాలహలం బయటికొచ్చిందట. దాని ధాటికి తట్టుకోలేక దేవతలంతా హాహాకారాలు చేస్తుంటే భోళాశంకరడు ఆ గరళాన్ని సేవించి గొంతులో నిలుపుకొన్న చోటు ఇదేనని స్థలపురాణం. అలా ఆపద నుంచి గట్టెక్కించిన శివుణ్ని 'ఆపత్‌సహాయేశ్వరర్' (ఆపద్బాంధవుడు)గా కొలుస్తారు.

**మన రాష్ట్రంలో...**

దక్షిణామూర్తి కొలువై ఉన్న ఆలయాలు మన రాష్ట్రంలోను ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోనే మూడు గుడులు, నాగలాపురంలోని వేదనారాయణ స్వామి ఆలయంలో దక్షిణభాగాన దక్షిణామూర్తి కొలువై ఉన్నాడు. నాగలాపురం మండలంలోనే సురుటుపల్లి పళ్లికొండేశ్వరస్వామి క్షేత్రంలో కూడా దక్షిణామూర్తి అమ్మవారితో సహా కనిపిస్తాడు. క్షీరసాగర మథనంలో హాలహలాన్ని సేవించిన శివుడు అక్కణ్నుంచి కైలాసానికి వెళ్తుండగా మార్గమధ్యంలో మైకం కమ్మి ఈ గ్రామంలో కొద్దిసేపు విశ్రమించాడట. అమ్మవారు సర్వమంగళ ఒడిలో విశ్రమించిన శివుణ్ని ఇక్కడ పళ్లికొండేశ్వరస్వామిగా అర్చిస్తారు. ఈ క్షేత్రంలో ప్రధాన ఆలయానికి పక్కగా నందివాహనాన్ని అధిష్టించిన దక్షిణామూర్తి ప్రతిష్టితమై ఉన్నాడు. పార్వతీదేవి ఆ స్వామిని ఎడమవైపు నుంచి ఆలింగనం చేసుకున్న రీతిలో గోచరిస్తుంది. శృంగారభరితంగా ఉండే ఈ స్వామిని దాంపత్యదక్షిణామూర్తిగా పూజిస్తారు. ఆయనను దర్శించుకుంటే పెళ్లికానివారికి వెంటనే వివాహం అవుతుందనీ పెళ్లైనా పిల్లలు పుట్టని వారికి సంతానం కలుగుతుందని నమ్మి. అలాగే శ్రీకాళహస్తిలో కొలువై ఉన్న వాయు లింగేశ్వరస్వామి ఆలయంలోనూ దక్షిణామూర్తి విగ్రహం ప్రధానం ఆలయ ప్రవేశంలోనే కనిపిస్తుంది. కోటప్పకొండ ప్రాచీన కోటేశ్వర ఆలయంలో శివుడు మేధా దక్షిణామూర్తిగా వెలశాడని ప్రతీతి.

ఇలా దక్షిణామూర్తి అవతారంలో కొలువై ఉన్న క్షేత్రాల్లో పరమశివుణ్ని గురువారం పూట అర్చిస్తే జ్ఞానాన్ని ప్రసాదిస్తాడని రోగాల నుంచీ విముక్తి కల్పిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ●





# నటరాజే సంబరపడిన కూచిపూడికి గిన్నీస్ ప్రశంస అవసరమా?

## కడిగిన ముత్యాలవంటి నేల కూచిపూడి నేల! కూచిపూడి నర్తకీ మణులతో నేల ఈనిందా?

## నింగినుంచీ తారలు ఉరికి తళుక్కు తళుక్కులతో ఛమక్ ఛమక్‌లుగా పదరంజనం చేస్తున్నారు?

కూచిపూడి నింగి అయింది. జంబూ, క్రౌంచ ద్వీపాలు నేల అయ్యాయి. నెరదలు లేని ఈ నేలపై అణువణువునా కూచిపూడి కాలి మువ్వలు ధీంతననా, ధీంతననా యని ధ్వని ధూపంలా, సిద్దేంద్రయోగి, నారాయణ తీర్థులకు నీరాజనం పడుతుంది. 'రారా' రారా యదు వంశకులాంబుధి సోమా రారా! నీవు రార అంటూ దివీ భువీ ఏకమైనట్టు ఇంద్ర ధనుర్రేకులు నింగినేలలను ఏకం చేసి నీల మేఘశ్యామునితో రాసలీలలాడుతున్నట్లు ఎందరు భామలు ఎందరు కోమలులు, ఎందరు సత్యభామాలను సందడి గౌనేట్టు చేస్తున్నదమ్మా! కూచిపూడి అంటే నృత్యపూడి నర్తనశాలమ్మా!

# పరిపూర్ణుడు అయ్యన్నపంతులు



గోటేటి పట్టు ఉత్తరీయంతో అయ్యన్న పంతులను సత్కరించారు

ఆగస్టు మాసం వచ్చిదంటే నాకు 28వ తేదీ తక్క ఏ తేదీ గుర్తు రాదు. అది పరిపూర్ణమానవత్వం మూర్తీభవించిన యుద్దనపూడి అయ్యన్నపంతులు 'పుట్టినరోజు'. విశాఖపట్నంలోని ఆధ్యాత్మిక చిత్తులకే గాకుండా, యావద్దేశంలోని పీఠాధిపతు లందరికీ ప్రేమపాత్రుడు.

విశాఖపట్నంలో పేరొందని మహాకామేశ్వరీ పీఠం. ఆయన, సతీమణి ధనలక్ష్మమ్మ పార్వతీపరమేశ్వరుల వంటి పుణ్య దంపతులు. వారు ఆధ్యాత్మిక సంపన్నులే కాదు. అపారమైన తెలుగు భాషాభిమానులు. ఆయన పుట్టినరోజు పండుగను, ఆయన శిష్యులు తలపెట్టగా, వారి చేతి ఒక్క రూపాయను కూడా ఖర్చు పెట్టనీయకుండా ఆయనే ఖర్చుపెడుతూ, అనేక మంది మహామహులను పట్టుపీతాంబరములతో సత్కరించి, వారికి పంచభక్ష్య పరమాన్న విందును చేసి, సంతృప్తిపరచడం 'అయ్యన్న పంతులు ధర్మమైతే, ఆయన్ను దర్శించి యథో చితముగా సత్కరించడం ధర్మంగా భావిస్తారు. గోటేటి శ్రీ రామారావు. అమ్మ కామేశ్వరి ఆ యింట కొలువై, ప్రేమ పరిపూర్ణుడైన అయ్యన్న కుటుంబానికి ఆ చంద్రతారార్క యశస్సు, ఆయురారోగ్యములు ప్రసాదించాలని శ్రీ వేంకటరమణుని ప్రార్థిస్తున్నాం.

# దేహశక్తిని దేశభక్తికే ధారవోసిన కవి రాయప్రోలు సుబ్బారావు!

సుకవి ఒక్కసారే పుడతాడు. పుట్టుకను సార్థకం చేసుకుంటాడు. కణ కణమునా ఉన్న కవిభక్తిని అక్షఱ, అక్షఱ ఒంపునా నింపివేస్తాడు. ఇది తెలుగు కవుల్లో గల గుణ విశిష్టత.

**ఏ దేశమేగినా ఎందుకాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవంబు**

– ఇందు తాను పుట్టిన భూమి ఋణంబు, తాను పుట్టిన జాతి ఋణంబు, తానున్న స్థానంబు– పొగుడుతూ ఉండు. ఎవరో ఏమనుకుంటారోననది తలుపకు. నీకు జన్మనిచ్చినది భారతభూమిరా.

హిందూస్థానమూ కాదు, ఇండియా కాదు, పురాణ ఇతిహాసాలలో చెప్పబడిన భారతదేశం. కుటిలురూ దేశాక్రమణ దారులూ 'ఇండియా'గా మార్చేసారు. భగవద్గీత! పఠించే భాగవతులకు బుద్ధిరావాలని గీతాచార్యుడు 'హే!భారతా' అని పదే పదే సంబోధించినది కూడా మన వాళ్లు మందమతులనే గీతాచార్యులకు కలిగింది; రాయప్రోలువారికి కలిగింది.

ఆయన ఆంధ్రజాతి నుద్దేశిస్తూ, మన శౌర్య ప్రతాపాలను, సిరిసంపదలను కళ్ళకు గట్టినట్టు చెప్పారు. అశ్వలక్షణమైన పరుగుగల మనం నెమరు వేసుకుంటుండాలి!



**అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ విద్యాలయాల స్థాపించునాడు**
**ఓరుగల్లున రాజవీర లాంఛనముగా పలుశస్త్ర శాలలు నిలుపునాడు**
**విద్యానగర్ రాజవీథులన్ కవిత 'పెండ్లి పందిళ్ళు' కప్పించునాడు.**
**పొట్నూరికి సమీపమున ఆంధ్ర సామ్రాజ్య దిగ్జయ స్తంభమెత్తించునాడు**
**ఆంధ్ర సంతతికే మహితాభిమాన దివ్యదీక్షాముఖ స్ఫూర్తి తీవరించె,**
**ఆ మహావేశ మర్థించి యాంధ్రులార! చల్లుడాంధ్రలోకమున అక్షతలు నేడు**

## భవ్య భావకవితా జాతీయకవి

దేశస్వాతంత్ర్యం కోసం ఉద్యమాలు, మరో వైపు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోరుతూ ఆంధ్రోద్యమాలు ముమ్మరంగా కొనసాగుతున్న రోజుల్లో రాష్ట్రాభిమానం ప్రబోధించే అనేక దేశభక్తి గీతాలు రచించి ఆంధ్ర కవితా లోకంలో తనకంటూ విశేష స్థానాన్ని పొందారు రాయప్రోలువారు.

రాయప్రోలు సుబ్బారావు 1892 మార్చి 17న గుంటూరు జిల్లాలోని గార్లపాడు గ్రామంలో జన్మించారు. విద్యార్థిగా ఉండే రోజుల్లో 1908లో నుండే ఆయన కవితలు, పద్యాలు రాయడం ప్రారంభించారు. కాకినాడలో రఘుపతి వెంకటరత్నం నాయుడుగారి ప్రోత్సాహంతో హైస్కూలు విద్య, మెట్రిక్యులేషన్ పూర్తయ్యాక, ఉన్నత చదువులకు వెళ్లకుండా హైదరాబాద్‌లో కొమర్రాజు లక్ష్మణరావు ప్రారంభించిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం రూపొందించడంలో సహాయకులుగా చేరారు. ఆ తర్వాత విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ రచించిన 'గీతాంజలి' చదివి, స్పందించి శాంతినికేతనంలో కొంతకాలం ఉండటానికి రవీంద్రుని అనుమతి పొందారు. 1915 నుండి 1918 వరకు శాంతి నికేతనంలో పలువురు కవి పండితుల సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. కాశీ వెళ్లి సుమారు ఏడాదిపాటు సంస్కృత పండితుల వద్ద వివిధ శాస్త్రాధ్యయనం చేసి విజయవాడ చేరి, తన సాహితీ కృషిని ప్రారంభించారు. తర్వాత రాయప్రోలు 38 సంవత్సరాలపాటు రాష్ట్రంలోని పలు విద్యా సంస్థలలోని తెలుగు శాఖలలో వివిధ పదవులు చేసి విద్యారంగ పరిపుష్టికి విశేష కృషి చేశారు.

రాయప్రోలు 1921లో ఉస్మానియా విద్యాలయంలో తెలుగుశాఖలో చేరి అధ్యాపకులుగా, రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేశారు. వరంగల్లులోని కళాశాల ప్రిన్సిపాల్‌గా, 1956లో తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతిగా మూడు సంవత్సరాలు పనిచేసి 1959లో సికింద్రాబాద్‌లో స్థిరపడ్డారు. 'తృణకంకణం', 'స్నేహలతాదేవి', 'ఆంధ్రావళి', 'మాధురీ దర్శనం' వంటి అనేక కావ్య సంపుటాలతోపాటు ఆదిశంకరుని 'భజగోవిందం', 'సౌందర్యలహరి' శ్లోకాలను ఆంధ్రీకరించారు. వాల్మీకి రామాయణం, సుందరకాండలను గేయరూపంలో అత్యంత రమణీయంగా రూపొందించారు. నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షునిగా, ఆంధ్ర పండిత పరిషత్ అధ్యక్షునిగా, రేడియో సలహా సమితి, ఫిలిం సెన్సార్ బోర్డు, కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యునిగా రాయప్రోలు విశేష సాహితీ సేవలు జేశారు. తెలుగు సాహితీలోకంలో భావకవిత్వ యుగకర్తగా స్థానం గడించిన రాయప్రోలు 1984లో జూన్ 30న సికింద్రాబాద్‌లో తుదిశ్వాస విడిచారు.

*If you want Comfortable Stay - Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114



# సర్వార్థ సిద్ధికి, సకల వరసిద్ధికి, సర్వ మంగళములనొసగే సకలైశ్వర్యప్రదాయిని శ్రావణ శుభలక్ష్మి వరలక్ష్మి

**శ్రీ పీఠే సురపూజితే! శంఖచక్ర గదాహస్తే శ్రీ మహాలక్ష్మీ ర్నమోస్తుతే** అని ప్రార్థిస్తే ఏ అమ్మ వెంటనే అనుగ్రహిస్తుందో ఆ అమ్మే ఆది మహాలక్ష్మీ, వరలక్ష్మీ, ఆ అమ్మహృతం నవనీత హృదయం.

**లక్ష్మీ క్షీర సముద్రరాజ తనయాం, శ్రీరంగ ధామేశ్వరీం–** అంటే చాలు ఉరుకులు పరుగులతో వచ్చి కోరిన వరాలననుగ్రహిస్తుంది. లక్ష్మీదేవికి శుచీ శుభ్రతలు ముఖ్యం. భక్తి ముఖ్యం. ఇంద్రుడైనా, కుబేరుడైనా శుచీ శుభ్రతలతో కూడిన భక్తిని విడనాడిననాడు లక్ష్మి ఒక్క నిముషమైననూ ఆ స్థానంలో ఉండదు. **పూజా చేతాము రారమ్మా! శ్రీమహాలక్ష్మికి పూజా చేతాము రారమ్మా!**

శుభమైన వాక్కుల్లో, ధర్మవర్తనుల్లో, సుమంగుల్లో మహా లక్ష్మమ్మా! అని భక్తితో, ఆర్తితో పిలుస్తే చాలు సిరులు పొంగిస్తూ సౌభాగ్యం ప్రసాదించే మంగళ కరమైన శక్తి ఆమెకే ఉన్నది. కోరిన వరాలిచ్చే కొల్హాపురి మహాలక్ష్మి ప్రాణికోటిని కోటిరూపాలతో కాపాడమని శ్రీరంగధామేశ్వరిని ప్రతి రోజూ వేకువనే ప్రార్థిద్దాం. వరాలిచ్చే వరలక్ష్మమ్మా, కొత్తగా పెళ్లయిన వారి పూజలను అనుగ్రహించి, వారింట అనోన్య అనన్య సందపలిచ్చి అనుగ్రహించే తల్లీ, నీవు కోటి కిరణాల సౌందర్యరాశివి. లోకోత్తర లావణ్య శోభలతో విరాజిల్లే వరలక్ష్మి, నీ వ్రతములను చేసేవారికి పూవు, పసుపూ, బొట్టూ, సిరి సంపదల ఐదవతనమూ, ఆయు రారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించు శక్తి, సహృదయత, నీకుగాక మరెవరికుందమ్మా!

పేదరాలింటికి భిక్షకు వెళ్లిన ఆదిశంకర భగవత్పాదులు ఆ గృహిణి దైన్యాన్ని, దరిద్రమును చూచి, నిను కనక మహాలక్ష్మిగ స్తుతించగనే ఆ యింట బంగారు కాసులు కురిపించి ఐశ్వర్యవంతురాలిని చేసిన మహదైశ్వర్య ప్రదాతవు. అదే శంకర భగవత్పాదులు క్లిష్టపరిస్థితులలో ఉన్నపుడు లక్ష్మీ నృసింహకరావలంబ స్తోత్రంతో

**ప్రహ్లాద మాన సరోజ విహార భృంగ**
**గంగా తరంగ ధవళాంగ ధీమాస్థితాంక**
**శృంగార సుందర కిరీటుల సద్వరాంగ**
**లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబం**

–స్తుతించగానే లక్ష్మీదేవి అంకమునగల నృసింహస్వామీ దయబూని, నా చేతినిపట్టుకుని రక్షించవయా అనగానే చేయిని పట్టుకుని రక్షించిన లక్ష్మీ నరసింహుడవయ్యా అంటే లక్ష్మీ యొక్క దయార్ద్ర హృదయం నిన్ను ఉగ్రత నుండీ ప్రసన్నింప చేయడం వల్లనే కదయ్యా. నీవనుగ్రహించావు.

# అష్టైశ్వర్య ప్రదాయిని ఆది మహాలక్ష్మీ ఆ అమ్మే! –

వేదములలో లక్ష్మీదేవి స్తవనమున్నది. అథర్వణ వేదము ఆమె యొక్క హృదయం స్వరూపములను చక్కగా వివరించినది. పద్మపురాణం, విష్ణు పురాణము. భాగవత మకరందములలో శ్రీమాతా మహత్యాన్ని, సౌందర్యాన్ని, సిరిసంపదలను గ్రహాన్ని సుమంగళీ ప్రసాదిత్వాన్ని కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, సకలదేవతా సమూహములచేతనూ కశ్యప, అత్రి, భృగువు, అగస్త్యాది ఋషులచే అమితముగా కీర్తింపబడిన ఆధారములున్నాయ్. వైభవలక్ష్మిగా ఆమె నెందరో ఆరాధించారు. ఐశ్వర్యలక్ష్మీగా కీర్తించారు. కరుణా కటాక్ష వీక్షణమే ఆమె ముఖ్యత్వాన్ని లోకాలన్నిటికీ తెలియచేసింది. శ్రీమహాలక్ష్మి శ్రీ మహావిష్ణువుపై కినుక వహించి, భూలోకమునకు వచ్చింది. తన హృదయాన్ని శ్రీలక్ష్మికే అంకితం చేసిన శ్రీ మహా విష్ణువు, లక్ష్మిని విడిచి ఉండలేక భూలోకానికి విచ్చేసాడు. సర్వార్థ సిద్ధికి, సకల వరసిద్ధికీ కారకులైన ఈ ఇరువురూ భక్తిప్రపత్తులు కల మానవులకు సుఖైశ్వర్యములూ కలిగించుటకే – కారణము కల్పించుకుని భూమిపై అవతరించిరీ యిరువురూ వరాల వరలక్ష్మి పూజను చేసి తరించండి.



నీవు తక్క నా కెవ్వరు దిక్కు– అని నిర్మల హృదయంతో, నిశ్చల భక్తితో స్తుతించినవారికి శ్రీ మహావైభవ లక్ష్మి తోడుగా ఉంటుంది. సంతానం లేని భక్తజనులు స్తుతించిన సంతాన లక్ష్మిగా అనుగ్రహిస్తుంది. విజయం కోరినవారికి విజయలక్ష్మిగాను, పాండిత్యం కోరినవారికి విద్యాలక్ష్మిగాను, ధనము కోరేవారికి ధనలక్ష్మిగాను, ధైర్యం కోరే వారికి ధైర్య లక్ష్మిగాను, అహరమూ కొలిచేవారికి ఆదిలక్ష్మిగాను, ఎవరు ఏఁవి కోరిననూ శ్రీ మహా లక్ష్మి అష్టలక్ష్మిగా అనుగ్రహిస్తుంది.

శ్రావణ మాసంలో ముత్తైదువులు కన్నెపిల్లలూ వరలక్ష్మిగాను, కార్తీకమాసంలో దీపలక్ష్మిగాను కొలిచి, అపారమైన సిరి, శాన్తి, సుఖము, ఆరోగ్యం, అనుకూలతలు పొంది మరుజన్మకు కూడా మోక్షం ప్రసాదించే మోక్షలక్ష్మిగా అనుగ్రహించుమమ్మా యని ప్రార్థించండి...

**బ్రాహ్మీంచ వైష్ణవీ భద్రాం షడ్భుజాం**
**చ చతుర్ముఖాం**
**త్రినేత్రాం చ త్రిశూలాం చ పద్మచక్రగదాధర**
**ప్రథమే త్ర్యంబకాగౌరీ ద్వితీయే వైష్ణవీ తథా**
**త్రుతీయే కమలా ప్రోక్తా, చతుర్థే లోకసుందరీ**
**పంచమే విష్ణు పత్నీచ, షష్టేచ వైష్ణవీ తథా.**
**సప్తమే చ వరారోహా అష్టమే వరదదాయిని.**


**శ్రీలక్ష్మ్యష్టకం**

**నమస్తేస్తు మహామాయే శ్రీ పీఠే సురపూజితే,**
**శంఖచక్రగదాహస్తే మహాలక్ష్మి ర్నమోస్తుతే.**
**నమస్తే గరుడారూఢే దేవాసుర భయంకరి!**
**సర్వపాపహరే దేవి మహాలక్ష్మి ర్నమోస్తుతే.**
**సర్వజ్ఞే సర్వ వరదే సర్వ దుష్టభయంకరి!**
**సర్వభాగ్యప్రదేదేవి! మహాలక్ష్మి ర్నమోస్తుతే.**
**సిద్ధి బుద్ధిప్రదేదేవి భుక్తిముక్తి ప్రదాయిని,**
**మంత్రమూరెత సదాదేవి మహాలక్ష్మి ర్నమోస్తుతే.**
**ఆద్యంత రహితే దేవి ఆదిశక్తీ మాహేశ్వరి,**
**యోగజ్ఞే యోగసంభూతే మహాలక్ష్మి ర్నమోస్తుతే.**
**స్థూలసూక్ష్మ మహారౌద్రే నహశక్తే మహోదరే,**
**మహాపాపారే దేవి మహాలక్ష్మి ర్నమోస్తుతే.**
**పద్మాసనస్థితే దేవి పరబ్రహ్మస్వరూపిణి,**
**పరమేశే జగన్మాత ర్మహాలక్ష్మి ర్నమోస్తుతే.**
**శ్వేతాంబరధరే దేవి నానాలంకార భూషితే,**
**గత్‌స్థితే జగన్మత ర్మహాలక్ష్మి ర్నమోస్తుతే.**
**మహాలక్ష్మ్యష్టకం స్తోత్రం యః పఠే ద్భక్తిమాన్నరః!**
**సర్వసిద్ధి మావాప్నోతి రాజ్యం ప్రాప్నోతి సర్వదా.**
**ఏకకాలే పఠే నిత్యం మహాశత్రు వినాశనం.**
**మహాలక్ష్మీర్ భవేన్నిత్యం సర్వదా వర్ధా శుభా.**
**ఇతి ఇంద్రకృత శ్రీ మహాలక్ష్మ్యష్టకస్తవః సంపూర్ణంః**
**దేవి దేహి! ధనం దేహి! దేవి దేవీయశో మయి,**
**కీర్తిం దేహి! సుఖం దేహి! ప్రసీద హరివల్లభే.**
**శ్రీ లక్ష్మీనారాయణ ప్రసాదసిద్ధ్యర్థం**
**సర్వకామ్యార్థ ఫలసిద్ధిరస్తు మనోభీష్టాఫలసిద్ధిరస్తు!**

# సహజ వర్ణ చిత్రకారుడు : దామెర్ల రామారావు

రాజమహేంద్రవరం.. గోదారి ఒడ్డు. ఇసుక తిన్నపై భారంగా నడుస్తున్నాడా బాలుడు. పదిహేనేళ్లుంటాయి. బడికెళ్ళకపోతే బడితెపూజ చేస్తామంటున్నారు ఇంట్లోవాళ్ళు. తనకేమో పొద్దస్తమానం బొమ్మలు గీసుకోవాలన్న పిచ్చి, చుట్టూ ఉన్న లంకలు, తెలతెల్లగా కురిచే మంచు, వరికంకుల పైని పిచుకలు, గున్న మామిళ్ళపై చిలకుల, ఊర్లకు కాపలా కాస్తున్నట్లు తాటి చెట్లు.. తెల్లకర్పూరంలా నీరెండ, పశ్చిమాకాశాన వాలే సూరీడు, శ్వేత వర్ణపూర్ణ చంద్రుడు. జల జల రాలే వెన్నెల.. అన్నింటినీ తన కుంచెలో బంధించాలన్నది ఆ కుర్రాడి కోరిక. అతగాడే దామెర్ల రామారావు. ఆ తపనతోనే ఆధునిక భారతీయ చిత్రలేఖనంలో ఆంధ్రాస్కూల్ సృష్టికర్త కాగలిగాడు.

రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల. ప్రిన్సిపాల్ ఆస్వాల్ జెన్నింగ్స్ కూల్డ్రే తన చాంబర్‌లో ఉన్నారు. దామెర్ల రామారావు అన్నయ్య వెంకట్రావు ఆ కాలేజీలోనే చదువుతున్నాడు. ఆ రోజు ప్రిన్సిపాల్ గదిలోకి వెళ్ళి "సర్.. మా తమ్ముడు అస్సలు చదవట్లేదు. ఎప్పుడూ బొమ్మలు గీసుకోవడమే. నాన్నగారికి కోపంగా.." అని చెప్పలేక ఆగిపోయాడు.



"నా దగ్గరకు తీసుకురా" అన్నారాయన.

ఆ మర్నాడే అన్నదమ్ములిద్దరూ వెళ్లారు. సన్నగా, పలచగా, కాంతులీనే కళ్ళతో, ఖద్దరు నిక్కరు, చొక్కా, డిప్పకటింగూ, మధ్య పాపిడితో, అమాయకంగా ఉన్న రామారావుని నిశితంగా చూశారు కూల్డ్రే. కళ్ళల్లో ఆశ్చర్యం. గుండెల్లో ఆనందం. ఓ మామూలు రాజ మహేంద్రవరంలో నిండా 16 ఏళ్లు కూడా లేని ఓ మామూలు కుర్రాడి కుంచెకు ఇన్ని చిత్రాలా? ఆ గీతల్లో అన్ని ఒంపులా? గట్టిగా హత్తుకున్నారాయన. ఆ రోజునుంచి "రామూ"అనిపిలుస్తూ ఆప్యాయంగా తనవాణ్ని చేసేసుకున్నారు.

కూల్డ్రే స్వయంగా చిత్రకారుడు. వర్ణాల వెనుక దాగిన కలల్ని చిత్రాల వెనుక దాగిన కళల్ని, ఆస్వాదించగలడు. ఒడిసిపట్టగలడు. అప్పటికే ఆయన దగ్గర అడవి బాపిరాజు, కవికొండల, భమిడిపాటి కామేశ్వర్రావ్, వరదా వెంకటరత్నం శిష్యరికం చేస్తున్నారు. రామూ కూడా ఆ బృందంలో చేరారు. వారంతా ఓ ఈడు పిల్లలే. సాయంత్రమైతే చాలు అందరూ సీతాకోక చిలుకల్లా కూల్డ్రే ముందు వాలిపోయేవారు. వారికోసం ఇంగ్లండ్ నుంచి ప్రత్యేకంగా వాటర్‌మెన్ పేపర్లు, పేస్టల్చు నీటి రంగుల్ని తెప్పించేవారు కూల్డ్రే. చిత్రకళలో తనకి తెలిసిన రహస్యాల్ని వారికి నేర్పుతుండేవారు. దామెర్ల ప్రతిభను శాస్త్రీయ శిక్షణతో సానబెట్టాలని కూల్డ్రే నిశ్చయించుకున్నారు.

రాజమండ్రి వంకాయవారి వీథిలో పెద్దమండువా లోగిలి. ఆచార పరాయణత్వానికి ఆనవాలు ఆ ఆవాసం. పొడవాటి చేతులున్న వాలుకుర్చీలో దామెర్ల వెంకట రమణారావు కూర్చొని ఉన్నారు. ఆ వెనుకే పల్చని యవనిక వెనుక ఆయన సతీమణి లక్ష్మీదేవి నిల్చొని ఉన్నారు. రమణారావు ఆయుర్వేద వైద్యులు. కందుకూరికి సన్నిహితులు. ఆ పక్కనే కూచొని ఏంవీ పట్టనట్లు బొమ్మలు గీసుకుంటున్నాడు రామారావు. ఎత్తయిన పీఠం కూల్డ్రే కూచున్నారు. 'మీ అబ్బాయి రాము చదువు గురించి బెంగపెట్టుకోకుండి. చిత్రకళలో అతన్ని మించినవారు లేరు" అన్నారు కూల్డ్రే.

రమణరావుకి కూల్డ్రేపై అపార గౌరవం. తొమ్మిదిమంది సంతానంలో రెండోవాడు రాము. 1897 మార్చి 8న రాజమండ్రిలో పుట్టాడు. అయిదో ఏటనే మున్సిపల్ స్కూల్లో చేర్పించారు. కాని ఎప్పుడూ చదివింది లేదు. మేనమామ గాడిచర్ల రామూర్తి చిత్రకళాధ్యాపకుడు. చిత్రకళలో ఓనమాలు దిద్దింది మేనమామ దగ్గరే.

ఆ రోజుల్లో రాజమండ్రిలో ఎక్కడో అక్కడ ఏదో ఒక నాటక ప్రదర్శనే! ఆయా నాటకాలకు తగ్గ తెరల్ని చిత్రకారులు తయారు చేస్తుండేవారు. వారు బ్యాక్ గ్రౌండ్ కర్టెన్లపై దృశ్యాలు, చిత్రాలు గీస్తుంటే చిత్రంగా చూస్తూ కూచునేవాడు రామారావు. రాముకి బొంబాయిలో శిక్షణ ఇప్పించాలన్నది కూల్డ్రే ఆలోచన. తల్లిదండ్రుల్ని ఒప్పించి, అన్ని ఖర్చులూ తానే భరించి బొంబాయి పంపారు.

1916 జూన్. బొంబాయి. జెజె స్కూలు ఆఫ్ ఆర్ట్స్.. ప్రిన్సిపాల్ సిసిల్ ఎన్ బర్న్స్ గదిలో ఉన్నాడు దామెర్ల. అప్పటికే రామారావు గీసిన చిత్రాల్ని ఒక్కటొక్కటిగా చూస్తున్నారాయన. చూస్తూ పరవశుడై ఎంట్రన్సే లేకుండా ఐదేళ్ల డిప్లొమా కోర్సులో నేరుగా మూడో సంవత్సరం కోర్సులో అడ్మిషన్ ఇచ్చేశారాయన.

దామెర్ల ప్రస్థానం ప్రారంభమైంది. హ్యూమన్ మోడల్స్, స్టిల్‌లైఫ్ అనాటమీ... అన్నింటిలోనూ సాధన మొదలైంది. పాశ్చాత్య చిత్రకళారీతుల మెళకువలపై పట్టు సాధించాడు. ఓ పక్క శిక్షణ.. మరో పక్క దేశమంతా పర్యటనలు.

1917 అక్టోబర్‌లో అజంతా ఎల్లోరాలకు కూల్డ్రేతో కలిసి వెళ్లాడు దామెర్ల. అజంతా గుహల్లో మొదటి గుహలో కుడ్య చిత్రాల్ని చిత్రించిన ఆంధ్ర చిత్రకారుల ప్రతిభను కళ్లారా చూశాడు. గురుశిష్యులిద్దరూ ఎంత దూరం తిరిగారో అంతులేదు. ఒక దశలో దామెర్ల నడవలేకపోతే.. కూల్డ్రే ఇరవైఏళ్ల రాముని భుజాలపైకి ఎత్తుకుని ప్రతి శిల్పాన్ని, చిత్రలేఖనాన్ని చూపించారు.

1918లో రవిశంకర్ రావత్ అనే మిత్రుడితో కలిసి గుజరాత్ వెళ్లాడు దామెర్ల. నాసిక్ గుహలు, లోనావాలా, కల్యాణి, బాంద్రా ప్రాంతాలు తిరిగారు. కతియవాడ గొల్లభామలు, గోండాల్ యువతి, విష్ణుప్రియ అనే గుజరాతీ మహిళ, బావిచెంత, కుంజవనం, గిరినాల్ అటవీ దృశ్యాలు... ఇలా ఎన్నెన్నో చిత్రాలు గీశాడు దామెర్ల.

1919లో జూన్‌లో సత్యవాణితో వివాహమైంది దామెర్లకు. ఆమెకూడా చిత్రకారిణే. ఇద్దరూ కలిసి బొమ్మలు గీసేవారు. వాటిని వివిధ ప్రదర్శనలకు పంపడం, బహుమతులు పొందడం, ఖ్యాతినార్జించడం.. వెంటవెంటనే జరిగిపోతున్నాయి.

1921 చివర్లో కెప్టెన్ సాల్మన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ విద్యార్థులంతా ఢిల్లీ, ఆగ్రా వెళ్లారు. ఢిల్లీ పార్లమెంట్ భవన నిర్మాణం జరుగుతున్న కాలమది. ఆ భవన నమూనా రూపకర్త బ్రిటిష్ వాస్తు శిల్పి సర్ ఎడ్విన్ లుటియెన్. ఓ రోజు ఆయనింట్లో విద్యార్థులందరికీ విందు. అందరూ ఇంగ్లీషు దుస్తుల్లో దొరల్లా రావాలన్నది సాల్మన్ ఆదేశం. కానీ దామెర్ల పంచె, లాల్చీ, పైన కండువా, నొసట తిలకం, నుదుటిపైకి వచ్చిన ఉంగరాల జుట్టుతో వచ్చాడు. దాంతో అతన్ని లోపలికి రావద్దన్నారు సాల్మన్. అంతా లోపలకు వెళ్లారు. "దామెర్ల ఎక్కడ?" అని అడిగారు లుటియెన్. స్వయంగా బయటకి వచ్చి దామెర్లను సాదరంగా లోనికి తీసుకెళ్లారు. ఓసారి గుజరాత్‌లో దక్షిణామూర్తి విశ్వవిద్యాలయం ప్రారంభానికి రవీంద్రనాథ్ ఠాగూర్ వచ్చారు. ఆయన రాజ్‌మహల్లో సందర్శకులతో ముచ్చట్లాడుతుండగా చూస్తూనే దామెర్ల ఠాగూర్‌ని పెన్సిల్ స్కెచ్ గీశారు. దాన్ని చూసి ముగ్ధుడైన ఠాగూర్ తన కివ్వమన్నారు. "లేదండి. ఇది నాకోసం వేసుకున్నాను. మీ ఆటోగ్రాఫ్ ఇవ్వండి దీనిపై అని ఆత్మీయంగా ఆత్మగౌరవంతో చెప్పాడు దామెర్ల రామారావు.

1922 దామెర్ల రాజమండ్రి తిరిగి వచ్చేశాడు. భార్యతో కలిసి ఆంధ్రా సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్స్‌ని స్థాపించాడు. 1923లో రాజమండ్రిలో అఖిల భారత చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశాడు. లక్నో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కి వైస్ ప్రిన్సిపాల్‌గా అవకాశం వచ్చినా వదులుకున్నాడు. తాను పుట్టిన గడ్డమీదే ఉండి సాంస్కృతిక కళావైభవాన్ని ద్విగుణీకృతం చేశాడు. భారతీయ చిత్రకళాదీపం రెపరెపలాడుతోందని పసిగట్టాడు. తనైదన నూతన శైలిని అందించాలనుకున్నాడు. ప్రాక్పశ్చిమ శైలుల్ని మేళవించి, ఆధునిక సంప్రదాయ చిత్రరీతుల్ని సమన్వయించి, పాశ్చాత్య చిత్రకళారీతుల్ని శోధించి, నవీన వాస్తవికతతో భారతీయ ఆధ్యాత్మిక వస్తువుని అందంగా చిత్రాలుగా మలచి, రూప, ప్రకృతి, పౌరాణిక చిత్రాలన్నింటికీ కొత్తదారులు వేశాడు.

ఉదయాన్నే లేవడం, కొంచెం సేపు నడక, ఆపై రోజను రోజంతా బొమ్మలు గీయడం, కైకేయి ఆలోచన, రామవనవాసం, అర్జున– ఊర్వశి, ద్రోణాచార్య, అభిమన్యు పతనం, సిద్ధార్థ రాగోదయం లాంటి కళాఖండాల సృష్టి.. వెరసి దామెర్ల కృషితో 'ఆంధ్రాస్కూల్'గా అవతరించింది.

1924లో కెనడాలోని టొరంటో వెంబ్లీలో రామారావు చిత్రాలు ప్రదర్శితమయ్యాయి. 1925లో ఆర్యతో కలిసి తిరుపతి వెళ్లాడు. నల్లమల కొండలు, స్వామి పుష్కరిణి, దేవాలయ స్తంభాలు, శిల్పాలు, ఎన్నింటినో స్కెచ్‌లుగా గీశాడు. తిరుగు ప్రయాణంతో విజయవాడ వచ్చేసరికి జ్వరం వచ్చింది. రాజమండ్రి చేరేసరికి అది మశూచిగా మారింది. రెండు నాళ్లయ్యేసరికి– కెనడా వెళ్లిన చిత్రాలు ఇంకా తిరిగి రాకుండానే ఆయన ప్రాణ దీపం 1925 ఫిబ్రవరి 6న ఆరిపోయింది. కానీ తెలుగు చిత్రా కళా లోగిలిలో, సాంస్కృతిక జగతి కౌగిలిలో దామెర్ల నేటికీ బతికే ఉన్నాడు. భవిష్యత్తులోనూ బ్రతికి ఉంటారు.

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి

# అల్లూరి సీతారామరాజుకు సముడు లేడు!



'స్వరాజ్యం కోసం' బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా సాయుధపోరాటం చేసిన వారిలోకెల్లా 'చిన్నవాడు', 'గొప్ప పోరాటం' చేసిన మహనీయ దేశ భక్తుడు అల్లూరి సీతారామరాజు. నాగరిక ప్రపంచం నుండి ఘోరారణ్య ప్రాంతాలకు వలస వచ్చి, అడవి పుత్రులనే 'పోరాటయోధులుగా' మలచుకొని 'బ్రిటిష్ దురహం'కార సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ఘనత రాజుకు మాత్రమే చెల్లింది..! నాటి జాతీయ కాంగ్రెసులోని కొందరు 'పెద్దలు' ఈ వీర సింహానికి మద్దతునివ్వకపోగా 'బందిపోటు' వంటి కళంకిత ముద్రలు వేసారు. చరిత్రకారుడితడని గుర్తించి తమ గుండెల్లో శాశ్వతంగా ప్రజలు దాచుకున్నది. జూలై 4న అల్లూరి జయంతి. ఆ మహాయోధుణ్ణి జ్ఞాపకం చేసుకున్నవారు తక్కువ.

అల్లూరి నడిపిన 'మన్యం విప్లవం' ఆంధ్రుల చరిత్రలోనే కాదు, భారతదేశ చరిత్ర కాదు కాదు ... ప్రపంచ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన వీరచరిత్ర. సీతారామరాజు 1897 జూలై 4 తేదీ సాయంత్రం 400 గం॥లకు, విశాఖ జిల్లా 'పాండ్రంకి'లో వేంకటరామరాజు, సూర్యనారాయణమ్మల తొలిచూలు బిడ్డగా జన్మించాడు. తండ్రి స్వగ్రామం నాటి కృష్ణాజిల్లా (నేటి పశ్చిమగోదావరి)లోని 'మోగల్లు'. తండ్రి జాతీయ భావాలు కలిగిన 'దేశభక్తుడు'. తల్లిభక్తిపరురాలు. సుక్షత్రియ కుటుంబం. ఒకసాయంత్రం రాజమండ్రి గోదావరి తీరంలో తండ్రీ కొడుకులు విహరిస్తుండగా తెల్ల దొర ఒకడు గుర్రంపై వెళుతున్నాడు. పాదచారులంతా నమస్కరిస్తూ వుంటే చిన్నారి సీతారామరాజు కూడా లేచి నిలబడి దొరకు నమస్కరించాడు. తండ్రి 'గూబ గుయ్య్'నిపించి "వందన మంటే మాతృభూమికి, కన్నవాళ్ళకి, గురుదేవుళ్ళకు చేసే వరంరా.. దేశాన్ని దోచుకునే నీచులకు దాన్ని ధారపోయటం మహాపరాధం?" అని పుత్రుడి మనసులో విప్లవబీజం నాటిన మహనీయుడు. దురదృష్టం కొద్దీ 1908 సం॥లో కలరా వ్యాధి సోకి తండ్రి దివంగతుడు కాగా రాజుకు కుటుంబానికి కష్టకాలమారంభమైంది. ఫలితంగా రామరాజు విద్యాభ్యాసం నరసాపురం, భీమరం, తుని, రాజమండ్రి, రామచంద్రపురం, కాకినాడ, విశాఖపట్టణాలలో సాగింది! చివరికి విసిగిపోయి 1913 తర్వాత బడిమెట్లెక్కడం మానేశాడు. వివిధ గ్రామాలలో బంధుమిత్రుల సహకారంతో వేదాంతం, యోగాభ్యాసాలు, కర్రసాము, కత్తిసాము, గుర్రపు స్వారీ, తాలింఖానాల్లో కసరత్తులు నేర్చుకున్నాడు. ఈ విద్యలు బాగా వంటబట్టాయి. సీతారామరాజులో దేశభక్తి పెల్లుబికింది. నాటికీ నేటికీ అడవిజనులు పడ్తున్న బాధను గుర్తించాడు. కట్టుకోవడానికి గుడ్డా, తినడానికి తిండి లేని అభాగ్యులను గుర్తించాడు. వారు పండిచుకున్న తిండి గింజలు వారి నోటికందకుండా చేయడం, వారిలోని అనాగరికం, అవిద్య, పేదతనాన్ని చూచి సీతారామరాజు గుండె నీరయింది. అంత బాధపడ్తున్నా వారిలో సత్యమున్నది, ధర్మమున్నది, ధీరమున్నదనే విషయాలు కనిపెట్టాడు. వారి ధైన్యాన్ని చూశాడు. తాను తెల్లదొరల దౌష్ట్యం, వారి తొత్తులైన వారిని మట్టు బెట్టాలి. దేశస్వాతంత్ర్యానికి తానొన సమిధయై, వారు సాగిస్తున్న దౌర్జన్యాలు అణగద్రొక్కి దేశస్వాతంత్ర్యం సముపార్జించాలంటే హింసను హింసతోనే ఎదుర్కోవాలని విల్లుపట్టాడు. బాణములెక్కుపెట్టాడు. అడవి జనులందరినీ వీరుల్నీ విలు కాళ్లగాను చేసాడు. ప్రథమంగా తన తిరుగుబాటును పోలీసుస్టేషన్‌లపై చూపాడు. ఆ స్టేషన్‌లలోని తుపాకులు, మందుగుండు సమాన్లు తప్పించి సాయుధపోరాటం చేసాడు. మెరుపుదాడులు చేసాడు.

విజయపు చివరిదశలో మనవాళ్ల వెనుక దెబ్బకు రూథర్‌ఫర్డు దొర తుపాకులకు చిక్కి కాల్చురా? ధైర్యముంటే కాల్చు. మీ దోపిడీలకు గురియవుతూ, రక్తసిక్తులవుతున్న అమాయకుల రక్షణలో నా రక్తాన్నే అభిషేకం చేస్తానని గుండెలొడ్డి దేశమాత విముక్తి కోరుతూ రక్తతర్పణం చేసాడు. చూచిన సూర్యుడు చూడలేక కనుమరుగయ్యాడు.

## ఏనుగులొచ్చాయమ్మ! ఏనుగులొచ్చాయ్!







ఏనుగులొచ్చాయమ్మ! ఏనుగులొచ్చాయి! ఉప్పాడ నుంచి రాలేదు, ఉప్పుటూరు నుంచి రాలేదు. ఏనుగు అంబారీపై రాముడే లేడు! సీతమ్మవారసలు ఏనుగెక్కలేదు. ఏనుగు ఏనుగు నల్లనో! ఏనుగు కొమ్ములు తెల్లనో? ఏఁవి తెలియలేదు? ఏ ఎరుకలేదు! ఎర్రదుంగల కోసం, పేలుడు బాంబుల కోసం ఎల్లినవాడల్లా ఆడ అడవినే ఉంటే– ఏ దారి ఎరుగక కాబోలు ఏనుగు ఊరిదారి పట్టింది. ఊరిజనాల వెంటాడుతుందీ. ఉరుకు పరుగున ఏనుగు వెంటాడుతుంటే తుండానికెరైనవాడు తుండు తుండవుతున్నాడు. సింహాలు చొరబడితే ఏఁచేయగలవు. అవి గరికి తినవురా! నిన్నురికి తింటాయి! మనుజుడుండ వలసని చోట మనుజులుండాలి. దనుజునిలా నీవు వనజుడవైతే ఏనుగులు, పులులు, సింహాలే కాదు నాగులు సహితమూ నిన్ను కరచి చంపుతాయి. మనిషివిరా! నీ వేదో మనిషిగ మనుషులను చంపుతూ ఊరిలోనే ఉండు! ఊరందరినీ చంపి ఉరితాడు వేసుకో!– మానవత్వం మంటగలపిన మనుజ రాక్షసుడా! నీ చావును నీవే వ్రాసుకుంటున్నావురా!

*Compliments from*

**Sri Krishna Bhat**

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala


**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504

**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

## 'కస్తూరి రంగయ్య - కరుణింపవయ్యా' కీర్తనకర్త

# అల్లూరి వేంకటాద్రిస్వామి



నడుస్తున్న చరిత్ర సెప్టెంబరు సంచికలో శ్రీ అల్లూరు వేంకటాద్రి స్వామి గురించి మిత్రుడు శ్రీ స.వెం. రమేష్ కొన్ని విశేషాలు బయటకు తెచ్చి మంచిపనిచేశారు. శ్రీమాన్ అల్లూరు వేంకటాద్రి స్వామి తిరువరుసుగాను, శ్రీమత్ పరమహంస తిరువేంగడ రామానుజ జియరుగాను వైష్ణవ భక్తకోటిలో ఈయన ఎంత ప్రసిద్ధుడో, వాగ్గేయకారుడిగా కూడా అంతటి సుప్రసిద్ధుడు. హరికథాగానానికి విశిష్టతని తెచ్చిన వాడు. భద్రాచల రామదాసు పరంపరకు చెందినకవి! ఆయన గురించి మరిన్ని విషయాలు నా దృష్టికి వచ్చినవి.

వేంకటాద్రి స్వామి శిష్యవర్గ ప్రసిద్ధుల్లో శ్రీ కట్టా రామదాసు, ఆయన శిష్యుడు సిద్ధాంతం నంబి, ఆ నంబిగారి శిష్యుడు బుక్కపట్టణం తిరువేంగడదాసు.. ఇలా ఈ శిష్య పరంపర తమిళనాట ఇంకా కొనసాగుతోంది. పెరంబూరులో 'అల్లూరి వెంకటాద్రి స్వామి భక్తజనసభ' ఉంది. 'శ్రీమాన్ అల్లూరి వెంకటాద్రి స్వామి దేవాలయ భక్తకోటి సంఘం' శ్రీరంగంలో ఏటా వెంకటాద్రిస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తోంది. 1955లో గాన కళాప్రపూర్ణ శ్రీ వింజమూరి వరదరాజ అయ్యంగార్ పాడిన వీరి కీర్తనలు మద్రాసు, హైదరాబాదుల నుంచి భక్తి రంజని రేడియో కార్యక్రమంలో ప్రసారం అయ్యాయి. విజయవాడ రేడియో కేంద్రంలో శ్రీరంగం గోపాలరత్నంగారు పాడిన పాటల రికార్డులు దొరుకుతున్నాయి.

'శ్రీ వేంకటాద్రిస్వామి హరినామ కీర్తనలు' పేరుతో 1955లో వావిళ్ళవారి పుస్తకం వెలువడింది. 170కిపైగా కీర్తనలు ఇందులో ఉన్నాయి. అందులో ఆయన జీవిత చరిత్ర కూడా సంక్షిప్తంగా ఉంది. 1972లో ఆర్ వెంకటేశ్వర్ సంకలనం చేసిన 'శ్రీవేంకటాద్రి స్వామి కీర్తనలు' పుస్తకాన్ని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం 2009లో డిజిటలైజ్ చేసి ఇంటర్నెట్ ఓపెన్ లైబ్రరిలో (ఓఎల్ 5402127 M ) ఉంచింది. 1030లలోనే ఆయన జీవిత చరిత్ర పుస్తకం కూడా తమిళంలో వెలువడింది. శ్రీ పి సాంబమూర్తి 'సౌత్ ఇండియన్ మ్యూజిక్' పరిశోధనాగ్రంథంలో వీరి వివరాలు కొన్ని ఉన్నాయి. మద్రాసు మూడువందల సంవత్సరాల జ్ఞాపిక సంచికలో ఈ నివాసం ట్రిప్లికేన్ అని ఉంది.

క్రీస్తు శకం 1807లో అక్షయనామ సంవత్సర ఫాల్గుణ పూర్ణిమ ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో సోమవారంనాడు ఈనాటి కృష్ణాజిల్లా, ఆనాటి నైజాం రాజ్యంలోని పరిటాల పక్కన కల అల్లూరి గ్రామ అగ్రహారంలో ఈయన జన్మించారు. వీళ్ళది శ్రీవత్స గోత్రం. తండ్రి వేంకయ, తల్లి వేంకమ. ప్రక్కనే ఉన్న జుజ్జూరు గ్రామంలోని నృసింహ దేవాలయంలో ఈయన తపోదీక్షలో ఉండేవాడు. భద్రాచలం నుంచి తిరిగివస్తూ దారిలో ఆగిన తూము నరసింహదాసు ఈయనకు తన తంబురా, గజ్జెలు, కరతాళాలు ఇచ్చి మెచ్చి ఆశీర్వదించాడు. ఈ సంఘటన తరువాత వెంకటాద్రిస్వామి పరమభక్తుడిగా మారిపోయాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా భద్రాచలం వెళ్ళి, అక్కడినుంచి భక్తజనంతో కలిసి కంచిచేరి అక్కడే స్థిరపడిపోయాడు. ఆ రోజుల్లో వైష్ణవ భక్తుల జీవిత కథలన్నీ ఇలానే కంచికి చేరేవి.

కంచిలో ఇంటింటికి తిరిగి మధూకరం తెచ్చుకొని జీవించాడు. తాను రచించిన కృతులు పాడుకొంటూ హరికథలు చెప్పుకొంటూ ప్రాచుర్యాన్ని పొందాడు. దేశ సంచారం ప్రారంభించి, అనేక వేల రూపాయలు భగవంతుని పేర సేకరించి కాంచీపురంలో దేవీ దేవులకు రెండు పుష్పవనాలు, శ్రీచందనం, శయ్యాగృహంలో చిక్కనిపాలు, జున్ను, పరిమళవిడియం మొదలయిన కైంకర్యాలు ఏర్పాటు చేశాడు. గోపురాన్నీ, మంటపాన్నీ, ఇంకా కంచి నగరంలో విష్ణువుకు సంబంధించిన దివ్య క్షేత్రాలన్నింటినీ జీర్ణోద్ధరణ చేయించాడు. అలాగే మహాబలిపురంలోని గుడిని కూడా బాగుచేయించాడు. ఆరాధనాది కార్యక్రమాల కోసం రూ.5000 పెట్టి మామండూరులో ఒక స్థలాన్ని క్రయం చేసి దేవాలయానికి సమర్పించాడు. కంచి వరదరాజస్వామి కోసం రత్నాలు పొదిగిన వైరముడిని చేయించి, గరుడోత్సవ సమయంలో అలంకరించే ఏర్పాటు చేశాడు. అమ్మవారికి స్వామివారికీ నవరత్న కిరీటాలు చేయించాడు.

శ్రీరంగం రంగనాథస్వామి పాండియకొండ అనే దివ్యకిరీటాన్ని తనకు చేయించమని కలలో చెప్పగా నిద్రలేస్తూనే ఆ పని మీద బయలుదేరి, బంగారాన్ని, రత్నాలను సేకరించటంలో పడ్డాడు. మరకతం ఒక్కటీ దొరకక చింతాక్రాంతుడై ఉంటే మళ్ళీ స్వామి కలలో కనిపించి, బంగ్లా దేశంలో మాధవదాసు అనే ఆయన ఇంట మరకతం తన కోసమే ఉందనటంతో మాధవ దాసుని కలుసుకొని మరకతం తెచ్చి కిరీటం పూర్తి చేయించాడు. రంగనాథుడికి రెండు కిరీటాలు, ఒక మకరకంఠి కూడా చేయించాడు. స్వామి వారికి నిత్య నైవేద్యాల కోసం తిరుప్పళాతురై ఊరు సమర్పించాడు. ఆముక్తమాల్యద కావ్యంలో ప్రసిద్ధమైన శ్రీ విల్లిపుత్తూరులో ఆండాల్ దేవికి అలంకరించే కిరీటం అమ్మవారి కోరికమీద వీరు చేయించిన దేనంటారు. మదురై దగ్గర 'తిరుమాలిరుంశోలై' అనే గ్రామంలో సుందరరాజ స్వామిగుడి విమానాన్ని ఆ స్వామి కోరిక మీద నిర్మింపచేసి నట్లు వీరి జీవితగాథ ద్వారా తెలుస్తోంది.

ఈ మొత్తం దైవకార్యాలకు సొమ్ముని ఆయన తన కృతులతో కూడిన హరికథాగానం ద్వారానే సమకూర్చగలిగారంటే, ఆయన హరికథాగాన వైశిష్ట్యం ఎంతటితో మనం ఊహించవచ్చు. తన జీవితచరమాంకంలో ప్రియశిష్యుడు అన్నలూరి నారాయణదాసుకు తన తంబూర, గజ్జెలు, కరతాళాలు బహూకరించి తన కృషిని కొనసాగించవలసిందిగా కోరారు. శ్రీ రంగనారాయణ జియ్యర్ గారి సన్నిధిలో సన్యసించి, తిరువేంగడ రామానుజ జియ్యరుగా మారారు. 1877లో సిద్ధిపొందారు. కొళ్ళడం గట్టున శ్రీ 'ఆళవందార్ పడుత్తురై' అనే సన్నిధి స్థలంలో వారి తిరుప్పల్లి (సమాధి) ఉన్నది.

'ఇంచుకైన దయరాద - యిభరాజవరద', 'సజల జలదగాత్రా- సరసిజ నేత్రా - నిజమని నీ పదభజన జేసెదు వదర', 'ఇంత పంతమేల నాతో నిందిరా రమణా', 'నామస్మరణ సేయుడీ జనులార- హరినామస్మరణ' ఇలాంటి వీరి కీర్తనలు చదువుకోవటానిక్కూడా మనోహరంగా ఉన్నాయి. 'దుద్దుపెట్టి నీవు దూరాన యుండక- పద్దులీడేర్చు నీపాలబడితినిక', 'ముద్దుపదములందు మువ్వలు గదలగ' లాంటి చరణాలు ఆయన సాహితీ వైదుష్యాన్ని తెలియచేస్తాయి. 'ధనమదాంధుల చేరు జేరక కడు ధన్యుడ నయ్యేదెన్నటికో..' లాంటి పలుకులు చదువుతున్నప్పుళడు దేవాలయాల అభివృద్ధిదకి ధన సేకరణ కోసం ఆయన ఎన్ని అవమానాలు భరించి ఉంటాడో ననిపిస్తుంది. ఒక మహాభక్తుడిగా భద్రాచలరామదాసు పద్ధతిలోనే ధనసేకరణ చేసి దైవ కార్యాలకు వెచ్చించినవాడు. ఆయన నిజాయితీ పట్ల ఆనాటి ప్రజలకుగల నమ్మకం, గురుభావాలే ఆయన అన్ని విజయాలను సాధించటానికి కారణమైనాయి. వేంకటాద్రి స్వామి కేవలం తమిళనాడుకే పరిమితం కాలేదనటానికి నెల్లూరు రంగనాథ స్వామి దేవాలయం, గోపురాలను జీర్ణోద్ధరణ చేయించిన వృత్తాంతమే సాక్ష్యం. భద్రాచల దేవాలయ రికార్డులు పరిశీలిస్తే అక్కడ వేంకటాద్రి స్వామి కార్యక్రమ వివరాలు తెలియగలవు. భద్రాద్రి రామునిపై వీరు రాసిన కీర్తనలు అనేకం ఉండటం కూడా మనం గమనించాలి. ఆయన జీవిత విశేషాలనూ, ఆయన రచనలలోని సాహితీ పరిమళాలను ఇంకా విశ్లేషించవలసి ఉన్నది. వీటి సేకరణలో సహకరించిన శ్రీమోదుగమూడి సుధాకర్, శ్రీ మల్లాది సూరిబాబు, శ్రీమంగళగిరి ఆదిత్య ప్రసాద్ గార్లకు కోటిదండములు కృతజ్ఞతలు. ఇలాటి మహా వాగ్గేయకారులను తెలుసుకున్ననాడే తెలుగులో కల భక్తి సాహిత్యం వెలుపలికి వస్తుంది. అందుకైనా 'కస్తూరి రంగయ్య - కరుణింపవయ్యా' అని ప్రార్థిద్దాం. **- డా॥ జి.వి. పూర్ణచందు**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**

# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

వేలాది నిరుపేదలు తినడానికి తిండి లేక, అక్షరజ్ఞానం లేక దుఃఖభూయిష్టమైన జీవితాన్ని గడుపుతూ వుంటే వారిని గురించి పట్టించుకోని వారు ద్రోహులు. - స్వామి వివేకానంద



ఒక వైపు పేదలు అన్నమో రామచంద్రా అని అలమటించిపోతూ కటిక దారిద్ర్యం నుండి మగ్గిపోతూవుంటే మన దేశ రాజకీయ నాయకులు భోగవిలాసాలతో మునిగి తేలుతూ వారి కష్టాలను గురించి ఆలోచించకుండా 5 రూపాయలకే ఢిల్లీలో (మనదేశ పార్లమెంటు వున్నచోట), 12 రూపాయలకు బొంబాయిలో (దేశంలోని అత్యంత అధికమైన వ్యాపార లావాదేవీలు జరుగుతున్న చోట) భోజనం దొరుకుతుందని ఇద్దరు ఎంపిలు తప్పుడు కూతలు కూశారు. ఎలెక్షన్ల టైమ్స్‌లలో నన్నా కడుపునిండా భోజనం తిందామని దీనావస్థలో వున్న జనులను మభ్యపెట్టి డబ్బుతో, మందుతో వారి ఓటు కొనుక్కొని గెలిచిన నాయకులే ఇట్లాంటి మాటలు మాట్లాడుతారు. ఏ మాత్రం ఇంగిత జ్ఞానం వున్నవాడైనా ఇలా మాట్లాడతాడా 12 రూపాయలకు ఏవి కొనగలం, ఏమి వస్తుంది. జనాన్ని వెర్రివాళ్ళనుకున్నారు. నాయకత్వం వహించేవాడు సేవక భావం కలిగి వుండాలి. అయ్యా, అమ్మా, బాబు అంటూ బతిమలాడి ఓటు వేయించుకుని ఆ తరువాత వారే మన పాలిట శాపమై, గుదిబండపై, మనపై అధికార పెత్తనం చలాయిస్తున్నారు మన నాయకులు.

గరీబీ హటావో నినాదాలతో గద్దెనెక్కి ఆ నిరుపేదల ఆకలి తీర్చడం, నిరక్ష్య రాసులకు విద్యను అందించడం, రోగపీడితులకు వైద్య సేవల్ని అందించడం, అనాథలకు ఆశ్రయం కల్పించడం వంటి కార్యక్రమాలు చెయ్యకుండా ఈ రకంగా మాట్లాడటం వారిని పరిహసించడం, వారిని ఎగతాళి చెయ్యడమే అవుతుంది. ఈసారైనా వీరందరికి తగిన గుణపాఠం నేర్పుతామా లేక యథాతథమేనా? ప్రపంచములో అవినీతి అగ్రస్థానంలో వున్న జాబితాలో భారతదేశం కూడా ఉండటం సిగ్గుచేటు. ఈ అవినీతి సొమ్ములో దారిద్ర్యంలో మగ్గుతున్న దీనులూ, ఆకలితో అలమటిస్తున్న అనాథలు, అక్షరజ్ఞానం లేని అమాయకులను ఉద్ధరించవచ్చు కదా! మనం మానవత్వపు విలువల నించి చాలా దూరంగా వెళ్ళిపోతున్నాం. సాంకేతిక నైపుణ్యం గణనీయంగా పెరిగిందని సంతోషించలేకపోతున్నాం. ప్రపంచమంతా మన భారతీయ సంస్కృతిని పొగుడుతూ వుంటే మనం పాశ్యాత్య పోకడలను అవలంభిస్తున్నాం. సాటి మానవుడిని గురించి ఆలోచించటం మానేసాం. మన మేధావులందరూ నోరు తెరిస్తే ఎక్కడ ప్రభుత్వ అవార్డులు రావో, పదవులు రావో అని నోరుమూసుకుని కూర్చుంటున్నారు. 2010లో అమెరికా అధ్యక్షుడు ఒబామా చేసిన ప్రసంగంలో స్వామి వివేకానంద గురించి మాట్లాడిన మాటలు, ఏ వార్తా పత్రికలలోను, టివీ ఛానెళ్లలోనూ పూర్తిగా ప్రచురించలేదు. ఇక అసలు విషయానికి వద్దాం. 12 రూపాయలకు, 5 రూపాయలకు భోజనం దొరుకుతుందా లేదా అని వివాదించుకునే బదులు ఆ డబ్బులు పట్టుకుని ప్రజలందరూ వారి ఇంటి ముందు నిలబడి ఆ అడ్రస్ కనుక్కుంటే అందరూ అక్కడికే వెళ్లి హాయిగా భోంచేయచ్చు?

పై విషయం ఒక రకంగా బాధ కలిగిస్తే రెండవ విషయం దానికన్నా ఘోరం. బీహారులో మధ్యాహ్న భోజన పథకం క్రింద భోజనం తిన్న పిల్లలు దరిదాపుగా 30 మంది మరణించారు. సామాన్య ప్రజలు తమ పేదరికాన్ని పటాపంచలు చేసుకునే సామర్థ్యాన్ని కలుగజేసేది విద్య. అందుకోసం తల్లిదండ్రులు తాము ఎన్నో అవస్థలు పడినా, అప్పుజేసైనా పిల్లలను చదువులకు పంపిస్తారు. వారికి ఉచితంగా పుస్తకాలు ఇస్తూ, ఫీజు లేకుండా చదువు చెప్పిస్తే చాలు, వారికి భోజనం పెట్టమని ఎవరూ అడగరు. పోని కనీసం ఒక పూటైనా భోజనంచేద్దామని పిల్లల్ని స్కూలుకి పంపించే తల్లిదండ్రులూ ఉన్నారనుకోండి. దానికోసం ఈ పథకం వుందని చెపితే కనీసం భోజనమన్నా మంచిది పెట్టాలి. అటు చదువు సరిగ్గారాక, భోజనం సరిగ్గా లేక ఆ పిల్లల చావుకి కారణం చెప్పక అమాయకుల జీవితాలతో ఆటలాడుకుంటున్నా, ఈ ప్రభుత్వాలు. కనీసం ఒక్క పూటైనా తిండి దొరుకుతుందని స్కూలుకి పంపే అమ్మానాన్నలు వున్నారు. ప్రొద్దునే నవ్వుతూ బడికి వెళ్ళిన పిల్లాడు మధ్యాహ్నం శవమై వచ్చాడంటే వారి ప్రాణాలు ఎలా విలవిలలాడుతుంటాయి? ఆ ప్రాణానికి మనం 2 లక్షలు విలువ కట్టాం.

ఇక మూడవది ఒక యువతిని బలత్కారంచేసి, ఆ అమ్మాయి నాలుకను కోసెయ్యడం ఎంతటి పైశాచికమైన చర్య? మనం ఇంకా రాతియుగంలో వున్నామా లేక అందరూ అనుకుంటున్నట్లు అభివృద్ధిపథంలో వున్నామా? రాక్షసకాలంలో వున్నట్లుగా వుంది. దానికి మన ప్రభుత్వ స్పందన అలాగే వుంది. ఢిల్లీలో జరిగిన సంఘటన మన మనసులలో ఇంకా అలాగే వుంది. దాని తరువాత వరుసగా మానభంగాలు ఐదో ఆరో జరిగాయి. కాని ఇంతవరకు నేరస్థులను కఠినంగా శిక్షించలేకపోయాం. వీటన్నింటికి కారణం మనకు సరైన అవగాహన, విద్య, శీలం లేకపోవటమే. శీలనిర్మాణం, మానసిక బలం, బుద్ధి వికాసం ఇవన్నీ విద్యవల్లే ఏర్పడతాయి. నిరక్షరాస్యత నిర్మూలనమే మనం మన ప్రజలకివ్వవలసింది. శీలభ్రష్టతే మన దేశ నాశనానికి ప్రథమ కారణం. నేడు మనం జంతువుల కంటే ఏమంత నీతిమంతులుగా లేం. మన నాయకులు శీలవంతులు కాని కారణం చేత వారి అనుయాయులు శీలం లేకుండా వున్నారు. పాశ్చాత్య ఆదర్శాలను, వేషభాషలను, ఆహార నియమాలను, అలవాట్లను అనుసరిస్తున్నందువల్లే మనకు ఈ అనర్థాలు. ఆ పాశ్చాత్య దేశాలు, మెరుపు, కాంతి. ఆ ప్రకాశం క్షణభంగురమే. ఇపుడిపుడే ఒక్కొక్క దేశం మెల్లిమెల్లిగా పతనావస్థలో వున్నాయి. మనం కళ్ళుండి చూడలేని గుడ్డివారిగా వున్నాం. ప్రతివ్యక్తి ఆలోచనా ఈ విధంగా ఉంటే బాగుంటుంది. అదేమంటే ఆస్తికుడవో, నాస్తికుడవో, వేదాంతివో, సన్యాసివో, క్రైస్తవుడివో, మహమ్మదీయుడవో లేక హిందువుడివో నువ్వు మొట్టమొదట నేర్చుకోవలసినది నేను భారతీయుడను, ఇది నా దేశం, ఈ దేశంలోని జనుల దుఃఖనివారణకు నన్ను నేను అర్పించుకుంటాను- అంటూ ప్రతిజ్ఞ బూనాలి. భగవంతుని గూర్చిన వివిధ సిద్ధాంతాలను తెలుసుకోగలిగన అవశ్యం నాకు లేదు అని చెప్పిన ప్రవక్త బుద్ధుడు. మంచి చెయ్యి, మంచిగా వుండు అదే నీకు మోక్షనిస్తుంది అని చెపుతూ ప్రపంచానికి శాంతిని బోధించినవాడు బుద్ధుడు ఆయనకే బాంబులు పెట్టిన సంస్కృతి మనది. ఇది చాలా బాధాకరమైన విషయం. దోషులను శిక్షించడంలో వారు ఏమతంవారైనా సరే మనం అలసత్వం చూపితే, ఓట్ల కోసం కళ్ళు మూసుకుంటే మనల్ని ఆ భగవంతుడు కూడా కాపాడలేడు. ఈ నాయకులు మనకు తిండిగింజలు ఇవ్వలేక పోతున్నారు. వీరి అవకతవక ఆలోచనల వల్ల పేద ప్రజల ప్రాణాలు కూడా హరింపబడుతున్నాయి. ప్రతి ఒక వ్యక్తి ఆలోచించవలసిన సమయం ఆసన్నమైనది పై నాలుగు విషయాలు ఎంతో బాధాకరమైనవి. పై సంఘటనలలో ప్రాణాలు పోగొట్టుకున్నవారంతా మన నాయకుల అలసత్వం వల్లనే, సమస్యకు స్పందించక పోవటం వల్లనే కనీసం ఇకనైనా బుద్ధి తెచ్చుకుంటే బాగుంటుంది. కోట్లాది ప్రజలు ఆకలితో, అజ్ఞానంలో జీవిస్తున్నాం. వారి ఓటుతో అందలమెక్కి వారిగోడు పట్టించుకోని ప్రతి నాయకుడు ద్రోహి. విశ్వాసఘాతకుడు. మోసగాడని నేనంటాను. ఈ పేద ప్రజల కోసం ఎవరి హృదయం తపిస్తుందో వారు మహాత్ములంటాను. పేదలని, నిరక్షరాస్యుల్ని, అజ్ఞానుల్ని, బాధితుల్ని ఆదుకుని వారికి కావలసినవి అందిస్తూ మహాత్ములవ్వండి.

× × ×

భారతదేశమంతా రాజకీయంగా కొన్ని కారణాలతో సతమతమవుతూ వుంది. మన ఆంధ్రదేశం అదేమీ పట్టనట్టుగా వుంది. విడిపోవడానికి పోరాటాలు జరుపుతున్నాం. విద్యార్థులను ఇందుకి సమిధలుగా వాడుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వానికి సరైన అవగాహన లేదు. ఆంధ్ర రాష్ట్ర నాయకులకు అంతకన్నా లేదు. మాలాంటివారెవరైనా కలిసి వుందామంటే చరిత్ర తెలియకుండా మాట్లాడద్దు అంటారు. కాని వారంతా తెలుగు జాతి గౌరవాన్ని తీసుకెళ్ళి ఓ విదేశీ మహిళ పాదాల దగ్గిర పెట్టారు. ప్రతి కాంగ్రెస్ నాయకుడూ అనే మాట **మేడమ్**గారి మాటకు కట్టుబడి వుంటామని చెపుతారు. అంటే ఆవిడ వద్దంటే మానేస్తారా? చరిత్ర ఎలా వున్నా కొన్ని దేశాలు విడిపోయి మళ్ళీ కలిసిపోతున్నాయి. మనం తెలుగువారందరం కలిసి ఒక రాష్ట్రంగా వుంటే బాగుంటుంది కదా. కాదని అన్నదమ్ములుగా విడిపోదామని అంటారు మాటమీద నిలబడండి, రోజుకో మాట మాట్లాడకండి. ఈ సమస్య ఇంతదూరం రాకూడదు. దీని గురించి మాట్లాడే దమ్మున్న నాయకుడు లేడు. కలిసి వుంటే లేని అభివృద్ధి విడిపోతే ఎలా వుంటుంది. ఈ ఒక్క రాష్ట్రం వల్ల మిగిలిన రాష్ట్రాలవారు కూడా వారి డిమాండ్లతో విడిపోవడానికి రెడీగా వున్నారు. కాంగ్రెస్ ఈ సమస్యను కోతిపుండు బ్రహ్మరాక్షసిగా తయారు చేసింది. ఆఖరికి ఏమవుతుందో ఆ ఏడుకొండలవాడికే ఎరుక. ●